పెన్ పవర్
తెలంగాణ రౌండప్



బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో, బ్రేకర్‌తో కూల్చివేతలు..

బౌరంపేట్‌లో పాతింటిపై కొత్త నిర్మాణాలు..
చర్యల అనంతరం చెక్కుచెదరని భవనం..



# కూల్చివేతలా..? 'మళ్ళీ' కట్టుకోమని సంకేతాలా..?

## దుండిగల్ సర్కిల్-59 'సిఎంసి' అధికారుల చర్యలు, అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది..!

- బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ పేదల బస్తీలో.. అక్రమ బహుళ అంతస్తుల కట్టడాలు..
- గురువారం డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో ఎప్పటి లాగనే మొక్కుబడి చర్యలు..
- కూల్చివేసిన తర్వాత మళ్ళీ నిర్మించు కోవచ్చని భరోసా ఇచ్చినట్టు సమాచారం..?
- బ్రేకర్‌లతో అక్రమార్కులకు అనుకూలంగా చర్యలు సరే..గ్యాస్ కట్టర్‌ల చర్యలేవి..?
- జీరో పర్మిషన్‌తో జీం5 అంతస్తుల నిర్మాణం కూల్చేస్తున్నారా..? సహకరిస్తున్నారా..?
- 120 గజాల్లో ఐదంతస్తులు..కూల్చివేతలు అంటేనే, మళ్ళీ కట్టుకోమని అర్థమా..?
- 18 ఏళ్ల నాటి ఇందిరమ్మ పట్టాలు క్రయ విక్రయాలతో చేతులు మారుతున్నాయి..?
- మొక్కుబడి కూల్చివేతలతో చేతులు దులుపుకుంటున్న అధికారులు..?
- గచ్చిబౌలి హైడ్రా చర్యల తరహా కఠినత్వం.. దుండిగల్‌లో ఎందుకు కనిపించడంలేదు..?
- అక్రమ నిర్మాణాలపై ప్రోత్సాహక చర్యల బాగోతంపై సర్వత్రా విమర్శలు..?
- నిర్మాణం ఏదైనా కూల్చివేతల వ్యవహారం.. తూతూ మంత్రపు చర్యలేనా..?
- ఈ ప్రశ్నలకు దుండిగల్ సర్కిల్-59 సిఎంసి అధికారుల సమాధానం..?
- టౌన్‌ప్లానింగ్ కూల్చివేతల ప్రక్రియ అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది..!

- బౌరంపేట్ సర్వే నెంబర్.576లో అనుమతుల్లేని జి+5 భవన నిర్మాణం..
- అక్రమ నిర్మాణంపై చర్యలు..చిన్న విస్తీర్ణాల్లో బహుళ అంతస్తులపై ప్రత్యేక నిఘా..!
- పాతింటిపై అదనపు అంతస్తులు, గచ్చిబౌలి తరహా హైడ్రా లాంటి కఠిన చర్యలేవి..?
- అక్రమ నిర్మాణంలో మళ్ళీ పనులు కొనసాగితే కూల్చివేస్తామని హెచ్చరిక..



వెంటనే నిర్మించుకునే వెసులుబాటు..



ఒకరు స్లాబ్‌ను బ్రేక్ చేస్తుంటే.. మరొకరు భద్రంగా, ఐరన్ రాడ్‌లు విరగకుండా చర్యలు..

-4లో

దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు.. బౌరంపేట ఇందిరమ్మ కాలనీ సర్వే నెంబర్: 576లో, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న 'జిం5' అక్రమ భవనాన్ని గురువారం అధికారులు, పాక్షికంగా కూల్చివేశారు.. కేవలం 120 గజాల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా 5 అంతస్తుల నిర్మాణం చేపట్టినట్లు గుర్తించిన అధికారులు, బ్రేకర్‌లతో స్లాబ్‌లు కూల్చేశారు.. ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకట మణి కరణ్ మాట్లాడుతూ.. చట్టాన్ని ఉల్లంఘించి నిర్మించే ఏ ఒక్క అక్రమ భవనాన్నీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ అంతస్తులు చేపడుతున్న అక్రమ నిర్మాణాలను గుర్తించేందుకు ప్రత్యేక నిఘా బృందాలను కూడా ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు.. ఇంతవరకు బాగానే ఉంది.. మరి అనుమతులు ఒకరకం, నిర్మాణాలు మరోరకం, మీ నిఘా బృదాలకు కనిపించడం లేదా..? అంటూ ప్రశ్నించే వారూ లేకపోలేదు.. అదనపు అంతస్తులు నిర్మించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించే అధికారులూ..! దుండిగల్ సర్కిల్-59 సిఎంసి కార్యాలయం చుట్టూ నిర్మించేవి మొత్తం అవేకదా..? ఏం చేస్తున్నారు..? సిఎంసి 'ఎస్‌టిఎఫ్' చర్యలు, ఇంత బలహీనంగా ఉంటాయని ఊహించని పరిణామంగా, స్థానికులు వ్యంగ్యారోపణలు చేస్తున్నారు.. సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 27:

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## నేడు రాఖీ పండుగ..

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక



హైదరాబాద్ పెన్ పవర్: అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ (రాఖీ పండుగ) నేడు దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతోంది. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం (ఆగస్టు 28) రాఖీ పండుగను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు తమ సోదరుల చేతికి రాఖీ కట్టి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను ఆకాంక్షిస్తారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు అండగా ఉంటామని, రక్షణగా నిలుస్తామని హామీ ఇస్తారు. దీంతో ఇళ్లలో పండుగ సందడి నెలకొంది.

## రాఖీ కట్టే సమయంలో పాటించాల్సిన నియమాలు, ధర్మ సూత్రాలు ఇవే..

వివరాలు 4లో..



### రక్షాబంధన్ విశేషాలు

- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి చిహ్నం
- అక్కాచెల్లెళ్లు రాఖీ కట్టి ఆశీస్సులు కోరుకోవడం
- సోదరులు అండగా ఉంటామని హామీ ఇవ్వడం
- మిఠాయిలు, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం
- ఇళ్లలో, మార్కెట్లలో పండుగ వాతావరణం



## రాఖీ పౌర్ణమి.. తెలంగాణలో 5 వేల ప్రత్యేక బస్సులు




హైదరాబాద్ పెన్ పవర్: రాఖీ పౌర్ణమి వేళ రద్దీ నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వెల్లడించింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# కూల్చివేతలా..? 'మళ్లీ' కట్టుకోమని సంకేతాలా..?


తాజా టిఫిన్స్ పక్కన ఏసిపి శ్రీనివాస్ కూల్చేసిన అక్రమ నిర్మాణం.. పూర్తయింది..


టెక్ మహీంద్రా ఎదురుగా డీసి, ఏసిపి, టిపిఎస్ సమక్షంలో కూల్చినా.. ఎలా పూర్తయింది..


సిద్ధార్థ అక్రమ నిర్మాణం ఈ దశలోనే నోటీసులు..

## కూల్చిన తర్వేతే సక్రమమైన.. అక్రమ నిర్మాణాలు..


బహుదూర్‌పల్లి కూల్చేసిన 1500 గజాల షెడ్డు, ఇలా ఎలా పూర్తయింది..

### కూల్చివేతలతో కొత్త వివాదం..!

అక్రమ నిర్మాణాన్ని పాక్షికంగా కూల్చివేసిన అధికారుల చర్యలు, ముగించడంపై విమర్శలువ్యక్తమవుతున్నాయి..అంతేకాకుండా నెలరోజుల తర్వాత మళ్లీ నిర్మించుకోవచ్చు అన్నట్టుగా నిర్మాణదారులకు పరోక్ష సూచనలు చేసినట్టు ఆరోపణలు వినవస్తున్నాయి.. ఇంతకీ ఆ అధికారి ఎవరు..? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి ఉత్పన్నం అవుతున్నాయి..అక్రమ నిర్మాణంపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోకుండా కేవలం కొంతమేర కూల్చివేతలతో సరిపెట్టడం వెనుక ఉద్దేశం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు నిజంగా అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలనుకుంటే.. శాశ్వత చర్యలు చేపట్టాలి కానీ..! మంది మార్బలంతో అట్టహాసంగా కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు, మళ్ళీ పూర్తి చేసి అద్దెకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి.. తీసుకున్న చర్యలేవి..? కూల్చిన అక్రమ నిర్మాణాలు ఏవి..? దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ చర్యలంటే..! ముదుపులకు ఎర్ర తివాచీలా..? అంటూ ప్రశ్నిస్తున్నారు..

- 3 పేజి తరువాయి

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్-59 పరిధి బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో గురువారం టౌన్‌ప్లానింగ్ కూల్చివేతలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. సర్వే నెంబర్ 576 ప్రభుత్వ భూమిలో 2007-2008లో, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పేదలకు 60 గజాల పట్టాలు సుమారు 580 మంజూరు చేసినట్టు సమాచారం.. ఇదంతా 18 ఏళ్ళ క్రితం లబ్దిదారులకు పట్టాలు మంజూరు వ్యవహారం మాట.. కానీ ప్రస్తుతం నిజమైన లబ్దిదారులు 10 శాతం ఉండవచ్చని, 90 శాతం, నిబంధనలకు విరుద్ధంగా, కొనుగోలు చేసిన పట్టాలతోనే నిర్మించినవని పలువురు ఆరోపిస్తున్నారు..ఈ పేదల బస్తీలో ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు పొందకుండానే..! 120 గజాల్లో గతంలో జీం1 నిర్మాణం చేపట్టాడు..! ఈ మధ్యనే గత కొద్దిరోజులుగా, అదనంగా మరో నాలుగు అంతస్తులు స్లాబ్‌ల నిర్మాణం పూర్తి చేశాడు..దీంతో ఫిర్యాదులు అందుకున్న దుండిగల్ సర్కిల్-59 సిఎంసి అధికారులు.. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో గురువారం అక్రమ నిర్మాణాలపై అధికారులు చేపట్టారు..ఈ కూల్చివేతలు నిజంగానే కఠిన చర్యలా.. లేక మొక్కుబడిగా తూతూమంత్రపు చర్యలా..? అన్న ప్రశ్నలకు సంబంధిత అధికారులే సమాధానం ఇవ్వాలి.. బౌరంపేట్‌లో జీరో పర్మిషన్‌తో నిర్మించిన ఈ ఐదంతస్తుల అక్రమ భవనంపై గురువారం దుండిగల్ సర్కిల్-59 సిఎంసి అధికారులు చేపట్టిన కూల్చివేతల తీరు అనుమానాలను రేకెత్తిస్తుంది..పేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ పట్టాల కాలనీలో 120 గజాల స్థలాల్లో జీం5 వంటి బహుళ అంతస్తుల నిర్మాణాలు ఎలా సాధ్యమయ్యాయన్నది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.. 18 ఏళ్ల క్రితం లబ్ధిదారులకు మంజూరైన పట్టాలను కొనుగోలు చేసినప్పుడే సంబంధిత పట్టా చెల్లుబాటు కాదని నిబంధనలు తెలియజేస్తున్నాయి.. అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా, పర్మిషన్ లేకుండా ప్రమాదకర బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి..

### గచ్చిబౌలి హైడ్రా చర్యలతో పోలిక ఎక్కడ..?

గచ్చిబౌలిలో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై హైడ్రా చేపడుతున్న చర్యలతో పోలిస్తే దుండిగల్ సర్కిల్-59 సిఎంసి అధికారుల కూల్చివేతలకు పొంతన ఉందా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. ఒకవైపు అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, నిఘా బృందాలను నియమించామని, డిప్యూటీ కమిషనర్ ప్రకటిస్తుండగా.. మరోవైపు కూల్చివేతల అనంతరం తిరిగి నిర్మాణాలకు అవకాశం కల్పించే పరిస్థితులు కల్పిస్తుంటే.. అక్రమ నిర్మాణాల నియంత్రణ ఎలా సాధ్యమవుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి..ఓవైపు గచ్చిబౌలి ఘటనతో అప్రమత్తమైన సిఎంసి కమిషనర్, హైడ్రా కమిషనర్, ప్రమాదకర అక్రమ కట్టడాలను గుర్తించి, చర్యలు చేపట్టాలని, ఆదేశిస్తుంటే..! దుండిగల్‌లో అక్రమ నిర్మాణాలపై మొక్కుబడి కూల్చివేతలు అధికారుల పనితీరును వెక్కిరిస్తోంది.

# రాఖీ కట్టే సమయంలో పాటించాల్సిన నియమాలు, ధర్మ సూత్రాలు ఇవే..

**హైదరాబాద్ పెన్ పవర్:** అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు, రక్షణబంధానికి ప్రతీకగా నిలిచే ఏకైక పండుగ రక్షాబంధన్. శ్రావణ పౌర్ణమి నాటి ఈ పండుగ రోజున ప్రతీ ఇంట్లోనూ సందడి వేరే లెవెల్‌లో ఉంటుంది. అక్కచెల్లెళ్లు తమ సోదరుల క్షేమాన్ని, ఆయురారోగ్యాలను ఆకాంక్షిస్తూ వారికి రాఖీ కడితే.. అన్నదమ్ములు తమ సోదరీమణులకు ఆజన్మాంతం అండగా ఉంటామని మాట ఇస్తారు. కానీ, ఈ పండుగ రోజున కేవలం రాఖీ కట్టేసి స్వీట్ తినిపించడమే కాకుండా.. మన శాస్త్రాలు, ధర్మ సూత్రాల ప్రకారం కొన్ని ప్రత్యేక నియమాలను పాటించడం చాలా ముఖ్యం. నిబంధనలకు లోబడి సరైన పద్ధతిలో రాఖీ కట్టినప్పుడే ఆ సోదర బంధానికి సంపూర్ణమైన శుభ ఫలితాలు, దైవానుగ్రహం దక్కుతాయి. అందుకే ఈ రాఖీ పండుగ నాడు పాటించాల్సిన ఆ ముఖ్యమైన నియమాలు ఏంటో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం..

- శుభ ముహూర్తం: రాహుకాలం, భద్ర కాలం లాంటి అశుభ సమయాలను పూర్తిగా వదిలి పెట్టి, శుభ ముహూర్తంలో మాత్రమే రాఖీ కట్టాలి. భద్ర కాలంలో రాఖీ కట్టడం వల్ల అశుభాలు జరుగుతాయని మన శాస్త్రాలు చెబుతున్నాయి.
- సరైన దిశ: రాఖీ కట్టించుకునే సోదరుడు తూర్పు లేదా ఉత్తర దిశ వైపు ముఖం పెట్టి కూర్చోవాలి.. దక్షిణం (యమ దిశ) వైపు ముఖం పెట్టి ఎట్టిపరిస్థితుల్లోనూ కూర్చోకూడదు.
- కుడి చేయి మాత్రమే: ఎప్పుడూ కూడా సోదరుడి కుడి చేతి మణికట్టుపైనే రాఖీ కట్టాలి. ఎడమ చేతికి కట్టడం వల్ల శాస్త్రీయంగా సరైన ఫలితం దక్కదు.
- తల కప్పుకోవడం: రాఖీ కట్టే సమయంలో, కట్టించుకునేటప్పుడు ఇద్దరూ తలపై రుమాలు లేదా వస్త్రం ఉంచుకోవడం (తల కప్పుకోవడం) చాలా ముఖ్యమైంది.

**రాఖీ కట్టడం వలన కలిగే దైవానుగ్రహం:**

- పూజా థాలి సిద్ధం: పూజా థాలి (పల్లెం)లో రాఖీ, కుంకుమ, అక్షింతలు, వెలిగించిన దీపం, మిఠాయిలు, నీటి పాత్రను సిద్ధంగా పెట్టుకోవాలి.
- దేవుడికి మొదటి రాఖీ: సోదరుడికి రాఖీ కట్టడానికి కంటే ముందుగా పూజా థాలిలోని తొలి రాఖీని విఘ్నేశ్వరుడికి (గణపతికి) లేదా మీ ఇష్ట దైవానికి సమర్పించి ఆశీర్వాదం తీసుకోవాలి.
- హారతి: రాఖీ కట్టడానికి ముందు సోదరుడికి హారతి ఇచ్చి దిష్టి తీయాలి.. ఆ తర్వాత నుదుటిన కుంకుమ తిలకం దిద్ది, తలపై అక్షింతలు వేసి ఆశీర్వదించాలి.

**రాఖీ ఎన్ని ముడులు కట్టాలి, ఏ కలర్ రాఖీ తీసుకోవాలంటే:**

- మూడు ముడులు: రాఖీ కట్టేటప్పుడు దారానికి సాంప్రదాయబద్ధంగా మూడు ముడులు వేయడం శుభప్రదం. ఇవి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఆశీస్సులకు, త్రిగుణాలకు ప్రతీకగా చెబుతారు.
- రాఖీ రంగులు: పసుపు, ఎరుపు, గులాబీ రంగు దారాలు లేదా ఓం, స్వస్తిక్ గుర్తులు ఉన్న రాఖీలను మాత్రమే తీసుకోవాలి.. నలుపు రంగు రాఖీలను ఎట్టిపరిస్థితుల్లోనూ తమ సోదరులకి కట్టొద్దు.
- ఈ బహుమతులని ఇవ్వొద్దు: సోదరులు తమ సోదరీమణులకు గిఫ్ట్ ఇచ్చేటప్పుడు కత్తెర, చాకులు, పదునైన వస్తువులు లేదా నల్లటి దుస్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకూడదు.



- ఈ రక్షాబంధన్ పండుగ నాడు ఈ చిన్న చిన్న ధర్మ సూత్రాలను పక్కాగా పాటిస్తూ పండుగ చేసుకుంటే.. అన్నాచెల్లెళ్ల బంధం మరింత గట్టిపడటమే కాకుండా ఇరు కుటుంబాల్లోనూ నిత్యం సంతోషం, డబ్బు సమృద్ధిగా ఉంటుందని మన శాస్త్రల్లో ఉంది.

ఎస్ఐఆర్ వెన్యూ సెంటర్‌లో ఏఈఆర్ఓ డీసీ పరిశీలన..





# దుండిగల్ సర్కిల్‌లో.. 'ఎస్ఐఆర్' ప్రక్రియ వేగవంతం..

## -దొమ్మర పోచంపల్లి, బౌరంపేట్, మల్లంపేట కేంద్రాల్లో డీసీ క్షేత్రస్థాయి పర్యటన..

- మూడు వెన్యూ సెంటర్లలో పర్యటించిన డిప్యూటీ కమిషనర్ ఏఈఆర్ఓ..
- బిఎల్ఓ-బిఎల్ఏ లు, ఓటర్లతో నేరుగా చర్చ
- డేటా మిస్‌మ్యాచ్‌ల పరిష్కారానికి చర్యలు..లి
- ఒక్కో కేంద్రంలో రోజుకు 40 మందికి షెడ్యూల్..
- డాక్యుమెంట్ల పరిశీలన.. అక్కడికక్కడే ఆన్‌లైన్ నమోదు..
- రాలేని ఓటర్లకు మరుసటి రోజు రీ--షెడ్యూల్ అవకాశం..

దుండిగల్, పెన్ పవర్, ఆగష్టు 27:దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ--2026 (ఎస్ఐఆర్--2026)ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు పారదర్శకంగా నిర్వహించేందుకు దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఏఈఆర్ఓ డా. ఎస్. వెంకట మణి కరణ్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు.. సర్కిల్ పరిధిలోని మూడు ముఖ్యమైన వెన్యూ సెంటర్లు దొమ్మర పోచంపల్లి వార్డు కార్యాలయం, బౌరంపేట్ వార్డు కార్యాలయం, మల్లంపేట అంబేద్కర్ భవన్‌లను ఆయన సందర్శించి ఎస్ఐఆర్--2026 ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశాల్లో బూత్ లెవెల్ ఆఫీసర్లు (బిఎల్‌వోలు), బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్‌ఏలు), సూపర్‌వైజర్లు, స్థానిక ఓటర్లతో డా. వెంకట మణి కరణ్ ముఖాముఖిగా మాట్లాడారు. ఓటర్లకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, 2002 నాటి ఓటరు డేటా అందుబాటులో లేని వారు, పాత రికార్డులతో ప్రస్తుత వివరాలకు డేటా మిస్‌మ్యాచ్ ఉన్న ఓటర్ల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను సమీక్షించారు..



### రోజుకు 40 మందికి ప్రత్యేక షెడ్యూల్..

ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్లు ఇబ్బందులు పడకుండా మూడు వెన్యూ సెంటర్లలో ప్రత్యేక షెడ్యూల్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఒక్కో కేంద్రంలో ప్రతిరోజూ 40 మంది ఓటర్లకు ప్రత్యేకంగా సమయం కేటాయించి వారి సమస్యలను పరిష్కరించేలా ఏర్పాట్లు చేశారు. షెడ్యూల్ ప్రకారం కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన ప్రక్రియపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు..డాక్యుమెంట్ల పరిశీలన.. ఆన్‌లైన్‌లో నమోదు నోటీసులో సూచించిన విధంగా ఓటర్లు సమర్పించాల్సిన ధ్రువీకరణ పత్రాలపై అధికారులు స్పష్టత ఇస్తున్నారు. ఓటర్లు తీసుకువచ్చిన పత్రాలను పరిశీలించిన అనంతరం సంబంధిత వివరాలను కేంద్రాల్లోనే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తున్నారు. దీంతో ఓటర్లు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చర్యలు చేపడుతున్నారు..

### రాలేని వారికి రీ-షెడ్యూల్ అవకాశం..

ఓటర్లకు కేటాయించిన షెడ్యూల్ తేదీన హాజరు కాలేని ఓటర్లకు కూడా అధికారులు వెసులుబాటు కల్పించారు. వారు మరుసటి రోజు రీ--షెడ్యూల్ చేసుకుని తమ వివరాల పరిశీలన, డాక్యుమెంట్ల సమర్పణ ప్రక్రియను పూర్తి చేసుకునే అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు..ఈ ప్రక్రియలో భాగంగా తమ ఓటరు వివరాల్లో ఏవైనా తప్పులు, పాత డేటాతో మిస్‌మ్యాచ్‌లు లేదా ఇతర సమస్యలు ఉంటే సంబంధిత వెన్యూ సెంటర్లను సంప్రదించి అందుబాటులో ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ఓటర్లకు సూచించారు..ఈ కార్యక్రమంలో స్థానిక బిఎల్‌వోలు సూపర్‌వైజర్లు, బిఎల్‌ఏలు, ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.క్షేత్రస్థాయిలోఈ ప్రక్రియను పరిశీలించిన ఏఈఆర్ఓ డా. ఎస్. వెంకట మణి కరణ్.. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు..

## చిట్యాల ఫ్లైఓవర్ దసరా నాటికి పూర్తి చేయాలి: మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** : హైదరాబాద్-విజయవాడ హైవేపై 17 బ్లాక్ స్పాట్లు ఉన్నచోట ఫ్లైఓవర్లు త్వరలో పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రహదారులపై మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. చిట్యాల ఫ్లైఓవర్ దసరా నాటికి పూర్తి చేయాలన్నారు. మిగతా ఫ్లైఓవర్లు డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రమాదాలు నివారించాలంటే రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని పేర్కొన్నారు. 6o2 లేన్ల రహదారి విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని సీఎం రేవంత్‌రెడ్డి కలిసినట్లు కోమటిరెడ్డి తెలిపారు.

## మహిళలపై ఎప్పుడూ ప్రెస్ మీట్ పెట్టను: కొండా సురేఖ ఎపిసోడ్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

మహిళల పట్ల తనకు అపారమైన గౌరవం ఉందన్న అనిరుధ్ రెడ్డి

కొండా సురేఖ గురించి బహిరంగంగా మాట్లాడొద్దని సీఎం ఆదేశించారని వెల్లడి

క్రమశిక్షణ కమిటీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్న అనిరుధ్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్‌పై ఆ పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు మహిళల పట్ల అపారమైన గౌరవం ఉందని, మహిళలపై తాను ఎప్పుడూ ప్రెస్ మీట్ పెట్టనని ఆయన స్పష్టం చేశారు. సొంత తల్లి తిట్టినా సరే ఏమీ మాట్లాడకుండా సైలెంట్‌గా అక్కడి నుంచి వెళ్లిపోతానని, మహిళలు తిట్టారని భావించి వారిని తిరిగి విమర్శిస్తే సమాజంలోని మహిళలంతా మనపై రివర్స్ అయ్యే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు.మహిళలు కన్నీళ్లు పెట్టుకుని వారి కంటి నుంచి ఒక్క చుక్క నీరు భూమిపై పడినా, ఆ కన్నీటి చుక్క సునామీగా మారి మనల్ని కొట్టుకుపోయేలా చేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. అందుకే వారిపై మీడియా ముందు మాట్లాడే ప్రసక్తే లేదని, ఒకవేళ తనను ఎవరైనా తిట్టినా వాటిని అక్షింతలుగానే స్వీకరిస్తానని తెలిపారు. ఇక కొండా సురేఖ వివాదంపై పార్టీ నాయకులు ఎవరూ బహిరంగంగా మాట్లాడవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు.ఈ అంశంపై ఇప్పటికే కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సుదీర్ఘంగా విచారణ జరుపుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఏఐసీసీ, పీసీసీ లేదా సీఎం రేవంత్ రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తామంతా పూర్తిస్థాయిలో కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. తప్పు ఎవరు చేశారనేది దేవుడు చూస్తున్నాడని, క్రమశిక్షణ కమిటీ ఇచ్చే తుది నివేదికను తాము శిరసావహిస్తామన్నారు. ఇదే సమయంలో తన నియోజకవర్గ అభివృద్ధికి రావాల్సిన నిధుల కోసం గట్టిగా పోరాడతానని, అవసరమైతే ప్రజల సంక్షేమం కోసం దీక్షలైనా చేస్తానని తెలిపారు.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో క్యాన్సర్లకు చెక్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 27:**సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ దోహదం చేస్తుందని డాక్టర్ హనుమంతరావు అన్నారు.ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం గార్ల మండల కేంద్రంలోని విశ్వశాంతి గర్ల్స్ స్కూల్ లోని 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల 18 మంది బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ టీకాలు అందజేశారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ హనుమంతరావు, వ్యాక్సిన్ ప్రాధాన్యంపై విద్యార్థినులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి మాట్లాడారు

బాలకల ఆరోగ్య రక్షణలో భాగంగా హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) టీకా ఎంతో ముఖ్యమైనదని వైరస్ వల్ల కలిగే ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పించడంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ సమర్థవంతంగా పనిచేస్తుందని, ముఖ్యంగా భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ వచ్చే అవకాశాలను గణనీయంగా తగ్గిస్తుందని వివరించారు. చిన్న వయస్సులోనే ఈ టీకా తీసుకోవడం ద్వారా మెరుగైన రోగనిరోధక శక్తి ఏర్పడుతుందని తెలిపారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై తల్లిదండ్రులు ఎలాంటి అపోహలు, భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ఇది సురక్షితమైన టీకా అని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి బాలికకు ఈ వ్యాక్సిన్ వేయించి వారి ఆరోగ్య పరిరక్షణకు సహకరించాలని తల్లిదండ్రులను కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అర్హులైన



విద్యార్థులకు వ్యాక్సిన్ అందజేస్తున్న వైద్య సిబ్బంది

బాలికలందరికీ దశలవారీగా హెచ్‌పీవీ టీకాలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ సక్కుబాయి ఏఎన్‌ఎంలు జయ స్వప్న సునీత ఆశా కార్యకర్తలు పాంశాల ఉపాధ్యాయులు విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో ఉద్రిక్తత.. పోలీసులతో బీఆర్‌ఎస్ శ్రేణుల తోపులాట

**హైదరాబాద్ పెన్ పవర్:** కామారెడ్డి పట్టణంలో గత ఏడాది ఇదే రోజున కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న రోడ్లు, డివైడర్లు ఏడాది గడిచినా ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోకపోవడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తంచేశాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కామారెడ్డికి వచ్చి హామీ ఇచ్చినా, ఇప్పటివరకు పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడం, స్థానిక ఎమ్మెల్యే సైతం సమస్యను పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూమాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు పిండ ప్రదానం నిర్వహిం చారు.ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నిం చడంతోబీఆర్‌ఎస్ శ్రేణులకు,

పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకుని కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏడాది గడిచినా హామీలు అమలు కాకపోవడంపై ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తున్నామని బీఆర్‌ఎస్ శ్రేణులు స్పష్టం చేశాయి.

# క్రీడలను ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన ఎజెండా: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రధాని మోడీ నాయకత్వంలో క్రీడలను ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన ఎజెండాగా ఉంది. గతంలో క్రీడల పట్ల నిర్లక్ష్యం ఉండేదని, రాజకీయ జోక్యం వల్ల ప్రతిభ ఉన్న నిజమైన క్రీడాకారులకు తగినఅవకాశాలు దక్కేవవి కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా, దేశవ్యాప్తంగా ఉన్న 1500 విద్యా సంస్థల విద్యార్థులు మరియు యువ క్రీడాకారులతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆన్లైన్ ద్వారా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ మన దేశంలో ప్రపంచంలోనే అత్యధిక యువత మరియు విద్యార్థుల జనాభా ఉన్నప్పటికీ, గతంలో క్రీడలను విస్మరించారు. కానీ నేడు పరిస్థితి మారుతూ ఉంది. కింది స్థాయి నుంచేక్రీడలను ప్రోత్సహించేందుకు ప్రధాని శ్రీకారం చుట్టడంతో, అంతర్జాతీయ పోటీల్లో మన దేశం ఎక్కువ పతకాలు సాధిస్తోందని పేర్కొన్నారు.అంతర్జాతీయ పోటీలకు వెళ్లే ప్రతీ క్రీడాకారుడిని ప్రధాని మోడీ స్వయంగా కలుస్తారు. ఎవరైనా గెలిస్తే తల్లిదండ్రులు లేదా కోచ్ల కంటే ముందే స్వయంగా ఫోన్ చేసి అభినందిస్తారు. ఒకవేళ ఓడిపోయినా సరే,క్రీడాకారులు నిరుత్సాహ పడకుండా వారికి ధైర్యం చెబుతూ అండగా నిలుస్తున్నారు. క్రీడాకారులకు కావలసిన పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు, వారికి నచ్చిన దేశంలో, నచ్చిన కోచ్లతో శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోంది. దేశంలోని
యువజనాభా ప్రాతిపదికన క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించాలన్నదే ప్రధాని లక్ష్యమని అన్నారు.

భారతదేశం 2030 కామన్వెల్త్ గేమ్స్కు ఆతిథ్యం ఇవ్వబోతోంది. అలాగే 2036 ఒలింపిక్స్ మన దేశంలో జరిగేలా విదేశాలతో చర్చలు జరుపుతూ గట్టి ప్రయత్నాలు చేస్తున్నాము. అప్పటికల్లా ప్రపంచదేశాలతో సమానంగా క్రీడా రంగంలో భారత్ ముందుండాలనేది మన ప్రయత్నం. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల అధినేతలు అందరూ చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలి. అందరం కలిసికట్టుగా ప్రయత్నిస్తే రానున్న రోజుల్లో ప్రపంచ క్రీడా చిత్రపటంలో భారతదేశం అగ్రస్థానానికి చేరుకోవడం తథ్యం అని మంత్రి పిలుపునిచ్చారు.

# నకిలీ వైద్యుల ఉచ్చులో పడకండి.. అప్రమత్తంగా ఉండండి: సీపీ సజ్జనార్

**హైదరాబాద్ పెన్ పవర్:** వైద్యం పేరిట అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుల పట్ల ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నానని నగర పోలీసు కమిషనర్ వి సీ సజ్జనార్అన్నారు.ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు కట్టుబడిన హైదరాబాద్ పోలీసులు ఇప్పటికే కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపుతున్నాం. తాజాగా నగరంలో ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘాపెట్టడం జరిగింది. 12 మంది నకిలీ వైద్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకున్నాం. ఎలాంటి విద్యార్హతలూ, కనీస వైద్య పరిజ్ఞానం లేని వీరు అసలైన వైద్యుల తరహాలోనే నటిస్తూ రోగులకుయాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బీపీ, మధుమేహం మందులతో పాటు విచక్షణారహితంగా ఇంజెక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తూ ఆరోగ్యాన్ని తీవ్ర ప్రమాదంలోకి నెడుతున్నారు. అవగాహనారాహిత్యంతో రోజులతరబడి మందులు వాడాలని సూచించడంతో ప్రజల ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.ఇలాంటి మోసగాళ్లపై మా నిఘా, కఠిన చర్యలు కొనసాగుతుండగా.. ప్రజలు కూడాచికిత్స కోసం వెళ్లే ముందు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలని అన్నారు.



తాము వెళ్లే క్లినిక్లు, ఆసుపత్రుల రిసెప్షన్ వద్ద జిల్లా వైద్యారోగ్య శాఖ జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ను ప్రముఖంగా ప్రదర్శించారో లేదో గమనించాలి. అలాగే వైద్యుల బోర్డులపైపేరు, విద్యార్హతలతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ కేటాయించిన రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలి. చికిత్స విధానం లేదా సిబ్బంది ప్రవర్తనపై ఏమాత్రం అనుమానం వచ్చినాతక్షణం అర్హత గల ఇతర నిపుణులైన వైద్యుల వద్ద రెండో అభిప్రాయం తీసుకోవాలి. ఎక్కడైనా నకిలీ వైద్యులు చలామణి అవుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే ఆలస్యం చేయకుండా డయల్ 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్కు తెలియజేసి అమాయకుల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నానని అన్నారు.

## ఘనంగా కళ్లెం నవజీవన్ రెడ్డి జన్మదిన వేడుకలు



**ఎల్బీనగర్ పెన్ పవర్ ఆగస్టు 27:** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డిని శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి తమ అభిమానాన్ని, ఆప్యాయతను చాటుకున్నారు. ప్రజలతో ఎల్లప్పుడూ మమేకమై, హయత్‌నగర్ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రజా సేవలో మరింత ముందుకు సాగుతూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీజేపీ శ్రేణులు ఆకాంక్షించారు.

# చిన్నారి వైదిక కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొంగులేటి


వైదిక కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం , పెన్ పవర్, ఆగస్టు 27:**ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డు హెచ్‌ఎన్ బజార్‌కు చెందిన రంగిశెట్టి ఉదయ్ శ్రావణి దంపతుల కుమార్తె చిన్నారి వైదిక ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. చిన్నారి మృతి విషయం తెలుసుకున్న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం రాత్రి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా చిన్నారి వైదిక మృతి పట్ల మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. చిన్నారిని కోల్పోయిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. వైదిక మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## నటుడు నారాయణ రావు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ సీనియర్ నటుడు, నిర్మాత జీవీ నారాయణ రావు (73) కన్నుమూసారు. గత కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. కృష్ణా జిల్లా, కురుమద్దాలి గ్రామంలో జన్మించిన నారాయణరావు, 1976 లో వచ్చిన అంతులేని కథ సినిమా ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు. దాదాపు సినిమాలలో పైగా నటించారు. పలు టి.వి.సీరియళ్లలో కూడా నటించారు. మద్రాస్ ఫిలిం ఇన్స్టిట్యూట్ లో శిక్షణ తీసుకున్నారు. రజనీకాంత్,చిరంజీవి కి నారాయణరావు మంచి మిత్రులు. అంతులేని కథ, ముత్యాల పల్లకి, అంగడి బొమ్మ , చిలకమ్మ చెప్పింది , గ్యాంగ్ లీడర్, హిట్లర్ వంటి సినిమాల్లో నటించారు. దేవాంతకుడు, ఇంటికో రుద్రమ్మ , యముడికి మొగుడు, పెళ్ళినీకు శుభం నాకు సినిమాలను నిర్మించారు. నారాయణ రావు చివరి చిత్రం "ఆలోచన"

# పి.యు.సి కమిటీ సమావేశంలో పలు ప్రభుత్వ సంస్థలపై సమీక్ష.

**పాల్గొన్న మైలవరం ఎమ్మెల్యే, పి.యు.సి కమిటీ సభ్యులు వసంత కృష్ణప్రసాదు**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ (పి.యు.సి) సమావేశం కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ గారి అధ్యక్షతన గురువారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులు, మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు గారు పాల్గొన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని పలు కీలక సంస్థలు, వాటి కార్యకలాపాలు, ఆర్థిక వ్యవహారాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలు, సంస్థల పనితీరు తదితర అంశాలపై కమిటీ సభ్యులు సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వ సంస్థలు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్నాయా, ప్రజలకు అందాల్సిన సేవలు సమర్థవంతంగా అందుతున్నాయా అనే అంశాలపై సమీక్ష నిర్వహించారు.ప్రధానంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యారంగ అభివృద్ధి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, అమలవుతున్న కార్యక్రమాలపై చర్చ జరిగింది. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు చేపడుతున్న చర్యలను కమిటీ పరిశీలించింది.అలాగే ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ పరిధిలో పట్టణ మౌలిక వసతుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ, వాటి సమర్థ వినియోగం వంటి అంశాలపై చర్చించారు.

ఏపీ రాష్ట్ర చేనేత కార్మికుల సహకార సంఘం లిమిటెడ్ ద్వారా చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్, సహకార సంఘాల బలోపేతం, చేనేత రంగ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై కూడా సమీక్ష జరిగింది.ఏపీ ఖాదీ మరియు గ్రామ పరిశ్రమల బోర్డు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల కల్పన, గ్రామీణ పరిశ్రమలకు ప్రోత్సాహం, స్వయం ఉపాధి కార్యక్రమాలు, ఖాదీ ఉత్పత్తుల అభివృద్ధి తదితర అంశాలపై కమిటీ సభ్యులు చర్చించారు.

అదేవిధంగా ఏపీ విద్యా మరియు సంక్షేమ మౌలిక
సదుపాయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు, సంక్షేమ శాఖలకు సంబంధించిన మౌలిక వసతుల అభివృద్ధి, నిర్మాణ పనులు, వాటి పురోగతి, నాణ్యతా ప్రమాణాలు తదితర అంశాలను సమావేశంలో పరిశీలించారు.ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా మరింత సమర్థవంతంగా పనిచేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని కమిటీ సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేసే దిశగా ఆయా సంస్థల పనితీరు ఉండాలని చర్చించారు.ఈ సమావేశం ద్వారా వివిధ ప్రభుత్వ సంస్థల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలపై పి.యు.సి కమిటీ సమగ్రంగా సమీక్షించింది.

## ఆరుగురిలో ఎవరికి ఛాన్స్

**హైదరాబాద్, ఆగస్టు 27, పెన్ పవర్:**
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గ విస్తరణపై జాతీయ రాజకీయాల్లో ఊహాగానాలు జోరందుకున్నాయి. వచ్చే నెల మొదటి వారంలోనే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అవకాశం ఉందన్న సంకేతాలు ఢిల్లీ వర్గాల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో జరగనున్న 5 రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు, ఇటీవలి కాలంలో ఎన్డీయే కూటమిలోకి కొత్తగా చేరిన మిత్రపక్షాలకు చోటు కల్పించడమే లక్ష్యంగా ఈ భారీ కసరత్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో స్థానం కోసం తీవ్రమైన పోటీ నెలకొంది.దక్షిణాదిలో కర్ణాటక తర్వాత బీజేపీకి అత్యంత పట్టున్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా అధిష్టానం అడుగులు వేస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాబల్యం అత్యంత కీలకంగా మారాయి. ఈ క్రమంలో కేంద్ర కేబినెట్‌లో రాష్ట్రానికి అదనపు బెర్తులు కేటాయించడం ద్వారా రాష్ట్రంలో పార్టీ కేడర్‌కు కొత్త ఊపునివ్వాలని అధిష్ఠానం భావిస్తోంది.తెలంగాణ నుంచి పలువురు సీనియర్ నేతలు, కీలక ఎంపీలు కేంద్ర మంత్రి పదవుల రేసులో నిలిచారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తన బలమైన బీసీ నాయకత్వంతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో తనకున్న పట్టుతో రేసులో ముందున్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కూడా తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ పేరును ఎస్టీ సామాజిక సమీకరణాల్లో భాగంగా పరిశీలిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ గిరిజన ప్రాంతాల్లో బీజేపీని తిరుగులేని శక్తిగా మార్చేందుకు ఆయనకు కేబినెట్ లేదా సహాయ మంత్రి హోదా కల్పించే యోచన ఉంది.అయితే ఢిల్లీ వర్గాల సమాచారం ప్రకారం, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు కేంద్ర కేబినెట్‌లో చోటు దాదాపు ఖాయమైనట్లు ప్రచారం జరుగుతోంది. మహిళా సాధికారతతో పాటు దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్‌కు దీటుగా బలమైన మహిళా నాయకత్వాన్ని నిలబెట్టాలన్నది అధిష్టానం వ్యూహం. జాతీయ ఉపాధ్యక్షురాలిగా, ఎంపీగా ఆమె చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని మహిళా కోటా కింద ఆమెకు మంత్రి పదవి దక్కే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరోవైపు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్న సీనియర్ నేత డాక్టర్ కె. లక్ష్మణ్ పేరు కూడా ప్రముఖంగా పరిశీలనలో ఉంది. ఒకవేళ ఎస్సీ,ఎస్టీ కోటాలో భర్తీ చేయాలనుకుంటే ఆదిలాబాద్ ఎంపీ నగేష్ కు చోటు దక్కే ఛాన్స్ ఉంది. జాతీయ కార్యవర్గ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో, బలమైన బీసీ ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు ఆయనకు మంత్రిమండలిలో చోటు కల్పించే అవకాశాలను తోసిపుచ్చలేమని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.ఈసారి విస్తరణ కేవలం రాజకీయ సర్దుబాటు కాకుండా పూర్తి స్థాయి వ్యూహాత్మక అడుగుగా మారనుంది. మహిళలు, బీసీ, ఎస్టీ వర్గాలకు కేబినెట్ ప్రాతినిధ్యం కల్పించి సామాజిక న్యాయం నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది. 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు భవిష్యత్ సార్వత్రిక ఎన్నికలకు బలమైన పునాది నిర్మించాలనుకుంటోంది. కూటమి విస్తరణలో భాగంగా కొత్త మిత్రులకు కేబినెట్ బెర్తులు కేటాయించడం ద్వారా భవిష్యత్తుకు బాటలు పరుచుకుంటోంది.త్వరలో మోడీ కేబినెట్ ముఖచిత్రం మారనున్న వేళ, తెలంగాణకు చెందిన ఏయే నేతలకు మంత్రి పదవులు దక్కుతాయనేది సర్వత్రా ఆసక్తి రేపుతోంది. అధిష్ఠానం తీసుకునే తుది నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలికే అవకాశం ఉంది.

## మంత్రికి పవర్ కట్...

**హైదరాబాద్, ఆగస్టు 27, పెన్ పవర్: :** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం అత్యంత ఆసక్తికరమైన మలుపు తిరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానంతో కొండా ఫ్యామిలీ వైరం తారస్థాయికి చేరిన వేళ.. ఆమెను నేరుగా పదవి నుంచి తప్పించకుండానే, మంత్రిత్వ శాఖలో ఉన్న అధికారాలన్నింటికీ కత్తెర వేసే సరికొత్త ఆపరేషన్ మొదలైంది. ప్రత్యక్షంగా వేటు వేస్తే వచ్చే రాజకీయ నష్టాన్ని నివారిస్తూ, పరిపాలనాపరంగా ఉక్కిరిబిక్కిరి చేసి ఆమే స్వయంగా తప్పుకునేలా లేదా దిగివచ్చేలా చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు లక్ష్యంగా కనిపిస్తోంది.పర్యావరణ, అటవీ శాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖకు తాజాగా ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. మంత్రికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే, ఆమె తనకు అనుకూలంగా నియమించుకున్న దాదాపు 20 మందికి పైగా అధికారుల డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసింది. ఇందులో కీలకమైన ఐఎఫ్ఎస్ అధికారులతో పాటు ఇతర ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. వీరిని తక్షణమే మాతృశాఖలకు పంపించడంతో పాటు, సచివాలయం, క్షేత్రస్థాయి యంత్రాంగానికి బలమైన సంకేతాలు వెళ్లాయి. ఉన్నతాధికారులు ఇకపై మంత్రి నిర్ణయాల కంటే సీఎంఓ ఆదేశాలకే ప్రాధాన్యత ఇవ్వాలనే పరిస్థితిని తీసుకురావడం ద్వారా శాఖాపరంగా ఆమెను పూర్తిగా డమ్మీ చేసేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కుటుంబం బహిరంగంగా విమర్శలు గుప్పించిన తర్వాత, ఆమెపై వెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారని అంతా భావించారు. అయితే, ఆమెను నేరుగా మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తే ఒక బలమైన బీసీ మహిళా నేతపై కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందనే సామాజిక ముద్ర పడే ప్రమాదం ఉంది. ఈ 'బీసీ సెంటిమెంట్' రాజకీయంగా బూమరాంగ్ కాకుండా ఉండటానికే అధిష్టానం తాత్కాలికంగా ఈ పరోక్ష వ్యూహాన్ని ఎంచుకున్నట్టు సమాచారం.నేరుగా వేటు వేయకుండా అధికారాలను నియంత్రించడం ద్వారా.. మంత్రిగా ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోలేరు. పరిపాలనాపరంగా, రాజకీయంగా పార్టీలో ఆమె ఒంటరి అవుతుంది. స్వయంగా రాజీనామా చేసేలా మానసిక ఒత్తిడి పెంచడం లేదా అధిష్టానం వద్దకు వచ్చి రాజీపడేలా చేయడం దీని వెనుక వ్యూహంగా ఉంది.మరోవైపు, కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ సెటిల్‌మెంట్ల వ్యవహారం చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. పాత ఆరోపణలు, సెటిల్‌మెంట్లపై పోలీసులు విచారణను ఒక్కసారిగా వేగవంతం చేశారు. గత కేసులను బయటకు తీసి దర్యాప్తు చేయడం వెనుక పక్కా వ్యూహం కనిపిస్తోంది. దీనివల్ల కొండా కుటుంబం కేవలం రాజకీయంగానే కాకుండా, చట్టపరమైన అంశాల్లోనూ పూర్తిగా డిఫెన్స్‌లో పడిపోతుంది. అవినీతి, అక్రమాల ఆరోపణల చుట్టూ చర్చను తిప్పడం ద్వారా కొండా సురేఖ సామాజిక కోణాన్ని లేదా 'బీసీ కార్డు'ను రాజకీయ రక్షణ కవచంగా వాడుకునే అవకాశాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా మూసివేసింది.ఏ రాజకీయ నాయకుడికైనా అధికారాలు లేని మంత్రి పదవిలో కొనసాగడం చిరాకు తెప్పిస్తుంది. చేతులు కాలకుండా ఆకులు పట్టుకునే చందంగా కాంగ్రెస్ నాయకత్వం వేసిన ఈ ఎత్తుగడ కొండా సురేఖను పూర్తి ఆత్మరక్షణలోకి నెట్టింది. అధికారం లేని శాఖను మోస్తూ ఉత్సవ విగ్రహంలా ఉండటమా? లేక పంతం వీడి సీఎం, అధిష్టానం ముందు లొంగిపోవడమా? అన్నది తేల్చుకోవాల్సిన సంకట స్థితిలో కొండా దంపతులు పడ్డారు. పరిపాలనాపరంగా హక్కులను గుల్ల చేస్తూ రాజకీయ పట్టు బిగించే ఈ వ్యూహం తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ రాజకీయ భవితవ్యాన్ని ఏ తీరానికి చేరుస్తుందో వేచి చూడాలి

## మీనాక్షి నటరాజన్ చేతులెత్తేసేరా

**హైదరాబాద్, ఆగస్టు 27, పెన్ పవర్:** :తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్‌ను ఏఐసీసీ నియమించినప్పుడు.. అధికారంలో ఉన్న పార్టీలో చెలరేగుతున్న ఆధిపత్య పోరును, అసమ్మతులను ఆమె అరికడతారని అధిష్టానం, పార్టీ కేడర్ భావించాయి. రాహుల్ గాంధీ బృందంలో అత్యంత కీలక సభ్యురాలిగా, సాదాసీదా జీవితం గడిపే అవినీతి రహిత నాయకురాలిగా ఆమెకున్న గుర్తింపు తెలంగాణలోని ముఠా రాజకీయాలను గాడిలో పెడుతుందని భావించారు. అయితే, ఆచరణలో తెలంగాణ కాంగ్రెస్ నేతల స్వయంప్రతిపత్తి, వర్గ రాజకీయాల ముందు ఏఐసీసీ ప్లానింగ్ పూర్తిగా తేలిపోయిందనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గాంధీ భవన్ వేదికగా జరుగుతున్న ఆధిపత్య పోరును, ముఖ్యమంత్రి వర్గానికి, మిగిలిన సీనియర్ నేతలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రాథమిక దశలోనే పరిష్కరించడంలో మీనాక్షి నటరాజన్ వైఖరి అత్యంత మెతకగా ఉందనే అభిప్రాయం బలపడింది. విమర్శలు, వివాదాలు రచ్చకెక్కిన ప్రతిసారీ సమీక్షలు , అంతర్గత చర్చలు లేదా కమిటీల పేరుతో సమయాన్ని గడపడమే తప్ప .. పార్టీ క్రమశిక్షణను దాటిన బడా నేతలపై కఠిన చర్యలు తీసుకునే సాహసం ఆమె చేయలేకపోయారు. దీనివల్ల అసమ్మతి నేతలకు ఏఐసీసీ పట్ల భయం లేకుండా పోయిందనే టాక్ వినిపిస్తోంది. అసమ్మతి స్వరాలు పెరిగినప్పుడు రాజీ మార్గాలు వెతకడం వేరు, కఠిన నిర్ణయాలతో పార్టీ లైన్ దాటకుండా చేయడం వేరు. తెలంగాణ కాంగ్రెస్ సంస్కృతికి తగ్గట్లుగా కఠిన నిర్ణయాలు తీసుకోకపోవడమే ఆమె వైఫల్యంగా కనిపిస్తోంది.తెలంగాణ కాంగ్రెస్‌లో సీఎం రేవంత్ రెడ్డికి ఉన్న పట్టు, అదే సమయంలో కేబినెట్ మంత్రులు , పాత తరం కాంగ్రెస్ నేతల నుంచి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకతను సమన్వయం చేయడంలో ఇన్‌ఛార్జ్ వ్యవస్థ విఫలమైంది. ఒకవైపు మంత్రుల మధ్య అంతర్గత పోరు, కొండా సురేఖ ఎపిసోడ్ వంటి ఘటనలు మీడియా ముందుకు వచ్చి పార్టీ ప్రతిష్టను దిగజార్చుతున్నా.. కేవలం అధిష్టానానికి నివేదికలు పంపడానికే ఇన్‌ఛార్జ్ పరిమితమయ్యారనే కామెంట్లు వస్తున్నాయి. ఈ అంతర్గత బలహీనతల నడుమ, మధ్యప్రదేశ్‌లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ దాఖలు చేయగా తెలంగాణలోని ఓ ప్రైవేట్ కేసు వివరాల వల్ల రిటర్నింగ్ ఆఫీసర్ నామినేషన్‌ను తిరస్కరించింది. ఆమె రాజకీయ జీవితంలో అతిపెద్ద ఎదురుదెబ్బగా మారింది. తెలంగాణ వంటి సంక్లిష్టమైన రాష్ట్రంలో గ్రూపు రాజకీయాలను నడిపించడంలో ఆమె అనుభవం సరిపోలేదనే సంకేతాలు పంపాయి. రాజ్యసభ అవకాశాన్ని కోల్పోవడం వల్ల ఢిల్లీ స్థాయిలోనూ, తెలంగాణ నేతల వద్ద కూడా ఆమె రాజకీయ పరపతి మరింత తగ్గిపోయిందనే విశ్లేషణలు సాగుతున్నాయి. కేవలం మంచి ఇమేజ్ , రాహుల్ గాంధీ ఆశీస్సులు మాత్రమే ప్రాంతీయంగా బలంగా ఉన్న వర్గ రాజకీయాలను నియంత్రించలేవు. తెలంగాణ కాంగ్రెస్ మరింత వివాదాల్లోకి వెళ్లకుండా ఉండాలంటే.. మీనాక్షి నటరాజన్ తన మెతక వైఖరి ని వీడి, శస్త్రచికిత్స తరహా కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదా అధిష్టానం ఒక పవర్‌ఫుల్ ప్రత్యామ్నాయ వ్యూహకర్తను రంగంలోకి దించడం తప్ప వేరే మార్గం కనిపించదని అంటున్నారు.

## రేసులో రాములమ్మ మంత్రి పదవిపై విజయశాంతి పేరు తెరపైకి

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ కొండా సురేఖపై చర్యల చర్చ ఖాళీ అయ్యే స్థానంపై అధిష్టానం కసరత్తు బీసీ మహిళా కోటాలో విజయశాంతికి అవకాశం. మంత్రి కొండా సురేఖ వ్యవహారం కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనకు చేరిన నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లో మంత్రి పదవిపై కొత్త చర్చ మొదలైంది. సురేఖను మంత్రివర్గం నుంచి తప్పిస్తే, ఆమె స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలనే దానిపై కాంగ్రెస్ నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.
మహిళా ప్రాతినిధ్యం, సామాజిక సమీకరణాలు, పార్టీ విధేయత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బీసీ సామాజికవర్గానికి చెందిన సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్సీ విజయశాంతి పేరు ప్రధానంగా వినిపిస్తోంది.
సురేఖ స్థానంలో బీసీ మహిళకు అవకాశం కల్పించే అంశాన్ని కాంగ్రెస్ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండగా, విజయశాంతి తన అభ్యర్థిత్వాన్ని పార్టీ పెద్దల వద్ద వినిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.
గతంలో తనకు మంత్రి పదవి ఇస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారనే అంశాన్ని విజయశాంతి వర్గాలు గుర్తు చేస్తున్నట్లు
సమాచారం. ఢిల్లీ స్థాయిలో ఆమెకు అనుకూలంగా లాబీయింగ్ జరుగుతున్నట్లు ప్రచారం ఊపందుకోవడంతో, కొండా సురేఖ స్థానంలో రాములమ్మకు అవకాశం దక్కుతుందా? అనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది.
అయితే సురేఖపై తుది నిర్ణయం వెలువడిన తర్వాతే మంత్రి పదవి భర్తీపై అధికారిక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం విజయశాంతి పేరు ఆశావహుల జాబితాలో ప్రముఖంగా వినిపిస్తోంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సింగరేణి నూతన ప్రాజెక్టులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష



**హైదరాబాద్ పెన్ పవర్:** మహాత్మా జ్యోతీరావు పూలే ప్రజాభవన్‌లో సింగరేణి నూతన ప్రాజెక్టులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై సంస్థ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా కీలక, వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ, మైనింగ్ రంగాల్లోకి సింగరేణి విస్తరించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. కర్ణాటకలోని దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ బ్లాక్‌లో అన్వేషణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్, వనాడియం, టైటానియం వంటి భవిష్యత్ కీలక ఖనిజాల అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు దేశీయ, అంతర్జాతీయ ఖనిజ వేలాల్లో సింగరేణి చురుకుగా పాల్గొనాలని సూచించారు.నైనీ స్ఫూర్తితో దేవదుర్గ ప్రాజెక్టును విజయవంతం చేసి, కీలక ఖనిజాల రంగంలో సింగరేణి విస్తరణకు బలమైన పునాది వేయాలని ఆయన పేర్కొన్నారు. సింగరేణిని మరింత లాభదాయకంగా తీర్చిదిద్ది, భవిష్యత్ తరాలకు బలమైన ప్రభుత్వ రంగ సంస్థగా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# మీరాలం ట్యాంకు్న పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**
హైదరాబాద్ మీరాలం ట్యాంక్ను ప్రముఖ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా సాగుతున్న పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ సాగుతున్న పనులను ఒక్కొక్కటిగా పరిశీలించారు.
అత్యుత్తమ డిజైన్లతో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. కొనసాగుతున్న పనులపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ద్వారా అధికారులు వివరించారు. ప్రణాళికలను పూర్తిగా పరిశీలించిన తర్వాత ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు.
నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ట్యాంక్ చుట్టూ జరుగుతున్న అభివృద్ధి పనులను ఓపెన్-టాప్ జీపులో ప్రయాణించి ఆ ప్రాంతాన్ని మొత్తంగా పరిశీలించారు. మీరాలం చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జ్ పనులను భారీ క్రేన్ సహాయంతో పైకి వెళ్లి చూశారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే చెరువు నుంచి మూసీలోకి వరద నీరు వెళ్లేలా నాలాను విస్తరించాలని చెప్పారు.
పర్యాటకులు చెరువులో వాటర్ స్పోర్ట్స్ కోసం డిజైన్ చేయాలని, చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి



సమీపంలో ఉన్నందున మీరాలం చెరువును, పరిసర ప్రాంతాలను పర్యాటకులకు ఆకట్టుకునేలా ఏర్పాట్లు జరగాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆకస్మిక పర్యటన సందర్భంగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# బోడుప్పల్లో మైనింగ్ ఏడీ ఇంటి పై ఏసీబీ దాడులు.. ఏకకాలంలో 8 ప్రాంతాల్లో తనిఖీలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో భూగర్భజలవనరుల శాఖకు చెందిన మైనింగ్ ఏడీ జయరాజు నివాసం పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఉదయం సోదాలు నిర్వహిస్తున్నారు. బోడుప్పల్ ఈస్ట్ హనుమాన్నగర్లోని ఆయన నివాసంతో పాటు మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం జయరాజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మైనింగ్ ఏడీగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఆయన తన అధికారిక ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల పై ఏసీబీ అధికారులు ఈ దాడులు చేపట్టినట్లు సమాచారం. హైదరాబాద్ ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్, వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. జయరాజుకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలు, ఆస్తుల పత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలు తదితర అంశాలను అధికారులు ఇప్పటి వరకు లభించినవి..
సోదాల్లో ఇప్పటివరకు రెండు కార్లు, రూ.1.50 లక్షల నగదు, రెండు పుస్తకాలు, జనగామ జిల్లాలోని 5 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన వివరాలు, ఫిక్స్ డిపాజిట్లు, పోస్టల్ డిపాజిట్లకు సంబంధించిన వివరాలు అధికారులు గుర్తించినట్లు సమాచారం. అయితే సోదాలు ఇంకా పూర్తి కాకపోవడంతో మొత్తం ఆస్తుల విలువ, ఇతర కీలక పత్రాలు లేదా నగదు, బంగారం తదితర వివరాల పై స్పష్టత రావాల్సి ఉంది. సోదాలు పూర్తయిన అనంతరం ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆస్తులు, పత్రాలు, ఇతర వివరాలను వెల్లడించే అవకాశం ఉంది. సోదాలు కొనసాగుతుండటంతో పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

**బోడుప్పల్లో మైనింగ్ ఏడీ ఇంటి పై ఏసీబీ దాడులు.. ఏకకాలంలో 8 ప్రాంతాల్లో తనిఖీలు**
ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో భూగర్భజలవనరుల శాఖకు చెందిన మైనింగ్ ఏడీ జయరాజు నివాసం పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఉదయం సోదాలు నిర్వహిస్తున్నారు. బోడుప్పల్ ఈస్ట్ హనుమాన్నగర్లోని ఆయన నివాసంతో పాటు మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం జయరాజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మైనింగ్ ఏడీగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఆయన తన అధికారిక ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల పై ఏసీబీ అధికారులు ఈ దాడులు చేపట్టినట్లు సమాచారం. హైదరాబాద్ ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్, వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. జయరాజుకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలు, ఆస్తుల పత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలు తదితర అంశాలను అధికారులు ఇప్పటి వరకు లభించినవి..
సోదాల్లో ఇప్పటివరకు రెండు కార్లు, రూ.1.50 లక్షల నగదు, రెండు పుస్తకాలు, జనగామ జిల్లాలోని 5 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన వివరాలు, ఫిక్స్ డిపాజిట్లు, పోస్టల్ డిపాజిట్లకు సంబంధించిన వివరాలు అధికారులు గుర్తించినట్లు సమాచారం. అయితే సోదాలు ఇంకా పూర్తి కాకపోవడంతో మొత్తం ఆస్తుల విలువ, ఇతర కీలక పత్రాలు లేదా నగదు, బంగారం తదితర వివరాల పై స్పష్టత రావాల్సి ఉంది. సోదాలు పూర్తయిన అనంతరం ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆస్తులు, పత్రాలు, ఇతర వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

# హిందూ సెంటిమెంట్ కు చోటుందా

**నెల్లూరు, ఆగస్టు 27, పెన్ పవర్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఎంపీ పదవికి రాజీనామా చేసిన తర్వాత రాజకీయాలకు కొంతకాలం దూరంగా ఉన్న వి.విజయసాయిరెడ్డి క్యాంపు మార్చి, సరికొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్లు ఆకస్మికంగా ప్రకటించడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే, పార్టీ స్థాపన కంటే ఎక్కువగా ఆయన ఎంచుకున్న హిందూత్వ ఎజెండా, సామాజిక మతపరమైన అంశాలు ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా కాకినాడ లవ్ జిహాద్ ఆరోపణల వ్యవహారం, సాధిక్ ఖాన్ అంశంపై పదే పదే మాట్లాడటం , ఏపీలో మత మార్పిడుల నిరోధక చట్టం తేవాలని కోరడం ద్వారా తన నూతన పొలిటికల్ లైన్ హార్డ్ కోర్ హిందూత్వ అని విజయసాయిరెడ్డి స్పష్టమైన సంకేతాలిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే.. ఉత్తరాది రాష్ట్రాలు లేదా పక్కనే ఉన్న కర్ణాటక మాదిరిగా మతపరమైన సమీకరణాలు , పోలరైజేషన్ఓటు బ్యాంకుగా మారిన దాఖలాలు లేవు . ఉమ్మడి ఏపీ నుంచి నేటి వరకు ఇక్కడ రాజకీయం అంతా కుల సమీకరణాలు, సంక్షేమ పథకాలు, స్థానిక అభివృద్ధి , బలమైన ప్రాంతీయ నాయకత్వాల చుట్టూనే తిరిగింది. బీజేపీ కూడా ఏపీలో సుదీర్ఘకాలంగా ఉనికిలో ఉన్నప్పటికీ, ఒంటరిగా మత ఆధారిత ఓట్లతో సక్సెస్ కాలేకపోయింది. అందుకే విజయసాయిరెడ్డి తెరపైకి తెచ్చిన లవ్ జిహాద్ , మత మార్పిడుల కార్డు ఆంధ్రా నేలపై ఎంతవరకు ఫలితాన్నిస్తుందనేది ప్రధాన ప్రశ్న.ఏపీ ఓటర్లు ఎప్పుడూ కుల ప్రాతిపదికన, సంక్షేమ ఆధారంగా ఓటు వేయడానికి ప్రాధాన్యతనిచ్చారు తప్ప.. తీవ్రమైన మతపరమైన ఎజెండాలను స్వీకరించలేదనడానికి గత ఎన్నికల ఫలితాలే ఉదాహరణ. విజయసాయిరెడ్డి ఈ వ్యూహాన్ని ఎంచుకోవడం వెనుక బలమైన రాజకీయ అంశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. వైఎస్సార్సీపీ మైనారిటీలు, క్రిస్టియన్ల వైపు ఆకర్షితమైందనే టాక్ ఉన్నందున .. అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కూడా మైనారిటీ ఓట్లను కోల్పోకూడదనే భయంతో లవ్ జిహాద్ వంటి సున్నితమైన అంశాలపై మాట్లాడటానికి వెనుకాడుతోందని ఆయన బహిరంగంగానే ఆరోపించారు. ఈ రెండు ప్రధాన వర్గాల మధ్య ఖాళీగా ఉన్న కట్టర్ హిందూ ఓటు బ్యాంకు ను టార్గెట్ చేయడం ద్వారా, తన కొత్త పార్టీకి ఒక ప్రత్యేకమైన గుర్తింపు సాధించవచ్చని విజయసాయిరెడ్డి భావిస్తున్నారని అనుకోవచ్చు. అయితే, ఈ ప్రయత్నం సక్సెస్ కావడానికి తీవ్రమైన ప్రతిబంధకాలు ఉన్నాయి. విజయసాయిరెడ్డి గత దశాబ్దకాలంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అత్యంత ఆప్తుడిగా, ఆర్థిక, వ్యూహాత్మక వ్యవహారాల పర్యవేక్షకుడిగా ప్రజలకు పరిచయం. అప్పట్లో సంక్షేమ సిద్ధాంతాలను సమర్థించిన ఆయన, ఒక్కసారిగా హిందూత్వ నేత గా అవతారం ఎత్తితే ఓటర్లు ఎంతవరకు విశ్వసిస్తారనేది అసలు ప్రశ్న. పైగా, క్షేత్రస్థాయిలో పార్టీకి కేడర్ బలమైన ఆర్గనైజేషనల్ నెట్‌వర్క్ లేకుండా కేవలం మీడియా విమర్శలు, ఎక్స్ పోస్టులతో తీవ్రవాదాత్మక ఎజెండాను ఓట్లుగా మార్చడం దాదాపు అసాధ్యం.మరో కోణంలో చూస్తే, విజయసాయిరెడ్డి వేస్తున్న ఈ మతపరమైన కార్డు ఓట్ల సాధన కోసం కాకుండా.. రాజకీయంగా తన ఉనికిని కాపాడుకోవడానికి , ప్రధాన పార్టీలను డిఫెన్స్‌లో పడేయడానికి వేసిన ఎత్తుగడ కావచ్చునని అనుకోవచ్చు. అధికార కూటమిపై విమర్శలు చేస్తూనే, వైఎస్సార్సీపీ ఓటు బ్యాంకును దెబ్బతీయడానికి లేదా నేషనల్ లెవల్లో ఉండే సిద్ధాంతపరమైన మద్దతును పొందేందుకు ఈ వ్యూహం ఉపకరిస్తుందని భావిస్తుండవచ్చు. ఆంధ్రప్రదేశ్ వాతావరణంలో ఉత్తరాది తరహా రైట్ వింగ్ రాజకీయం పనిచేయడం అత్యంత కష్టం. స్థానిక సమస్యలు, రైతులు, నిరుద్యోగం, రాజధాని నిర్మాణం వంటి ప్రధాన అంశాలను పక్కనపెట్టి కేవలం ముస్లింలు, క్రిస్టియన్లను బూచిగా చూపే రాజకీయాలను నమ్ముకుంటే.. విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పరిమిత ప్రభావానికే పరిమితమయ్యే ప్రమాదం ఉంది.

# జోగిని తలంటిన అధిష్టానం



**విజయవాడ, ఆగస్టు 27, పెన్ పవర్:** మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ సీనియర్ నేత జోగి రమేష్ కుటుంబ వివాదం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. కుటుంబ కలహాలను, వైవాహిక సమస్యలను నేరుగా పార్టీ ఆఫీసులో ప్రెస్ మీట్ ద్వారా బయటపెట్టి, దానికి రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేయడంపై వైఎస్సార్సీపీ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు చెబుతున్నారు. వ్యక్తిగత తప్పులను లేదా కుటుంబ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పార్టీ ప్లాట్‌ఫామ్‌ను వాడుకోవడం వల్ల వైఎస్సార్సీపీ ఇమేజ్ తీవ్రంగా దెబ్బతింటోందని తాడేపల్లి వర్గాలు భావిస్తున్నాయి. వివాదం ముదిరి జోగి రమేష్ కోడలు మేఘన స్వయంగా మీడియా ముందుకు వచ్చి మాట్లాడటంతో ఈ వ్యవహారం మరింత సున్నితంగా మారింది. అత్తారింట్లో తనకు జరిగిన అన్యాయాన్ని, వేధింపులను వివరిస్తూనే.. న్యాయం కోసం సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసినా ఫలితం లేకపోయిందని, జగన్ మోహన్ రెడ్డిని కలవడానికి కూడా అవకాశం దక్కలేదని ఆమె బహిరంగంగా వెల్లడించడం పార్టీకి మింగుడుపడటం లేదు. సమాజంలోనూ, చట్టపరంగానూ ఇలాంటి సున్నితమైన కుటుంబ వ్యవహారాల్లో సాధారణంగా బాధితురాలిగా నిలిచే మహిళల వైపే ప్రజా సానుభూతి ఎక్కువగా ఉంటుంది. పైగా, బయటపడిన వీడియోలు కొన్నే, అసలు ఆధారాలు ఇంకా చాలా ఉన్నాయి అని మేఘన హెచ్చరించడంతో ఇది పార్టీకి మరింత డ్యామేజ్ తెచ్చిపెడు తుందనే భయం వైఎస్సార్సీపీలో మొదలైంది.ఆరోగ్యపరమైన, వైవాహికపరమైన వైఫల్యాలు తెలిసి కూడా పెళ్లి చేసి జీవితాన్ని నాశనం చేశారనే ఆరోపణలతో పాటు, మత విశ్వాసాలు, కట్న వేధింపుల వ్యవహారాలను కూడా బయటకు లాగడం వల్ల ప్రతిపక్షాలకు మంచి రాజకీయ అస్త్రం దొరికినట్లయింది. ఓవైపు జగన్ సహా పార్టీ కీలక నేతల పేర్లను ఈ వివాదంలోకి లాగడం, మరోవైపు మతపరమైన అంశాలు ప్రజల్లోకి వెళ్లడం పార్టీ సాంప్రదాయ ఓటు బ్యాంకుపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. అందుకే జోగి తీరుపై జగన్ అసహనంతో ఉన్నట్లుగా చెబుతున్నారు.ఈ పరిణామాలన్నింటినీ తీవ్రంగా పరిగణించిన వైఎస్సార్సీపీ నాయకత్వం.. జోగి రమేష్‌ను హెచ్చరించినట్లు సమాచారం. వ్యక్తిగత లే, కుటుంబ సంక్షోభాలకు వైఎస్సార్సీపీకి చుట్టవద్దని న, పార్టీ పేరును ఈ వ్యవహారంలోకి లాగవద్దని తాడేపల్లి ప్యాలెస్ నుంచి కఠిన ఆదేశాలు వెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. లీగల్‌గానూ, వ్యక్తిగతంగానూ తేల్చుకోవాల్సిన సమస్యలను రాజకీయంగా మార్చవద్దని చెప్పినట్లుగా తెలుస్తోంది. వీలైనంత త్వరగా వివాదాన్ని ముగించుకోవాలని ఆదేశించినట్లుగా చెబుతున్నారు

# వెలిగోండ ప్రాజెక్టు అడుగులు

**ఒంగోలు, ఆగస్టు 27, పెన్ పవర్:**
ప్రకాశం జిల్లా ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. మూడు దశాబ్దాల క్రితం తానే శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఇప్పుడు ముఖ్యమంత్రిగా తానే ప్రారంభించే అవకాశం రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రజలతో పంచుకున్నారు.1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. అప్పట్లో ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సాగునీటి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. అయితే వివిధ కారణాలతో పనులు సుదీర్ఘకాలం కొనసాగాయి. ఎన్నో అడ్డంకులు ఎదురైనా ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగామని సీఎం పేర్కొన్నారు.ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ పనులను అధికారికంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు 30 ఏళ్ల క్రితం వేసిన పునాదికి ఇప్పుడు ఫలితం కనిపించడం తనకు ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తోందని చంద్రబాబు అన్నారు. తన సంకల్పం నెరవేరుతున్న ఈ సందర్భాన్ని ఒక గొప్ప అనుభవంగా ఆయన అభివర్ణించారు. దీనికి సంబంధించిన 1996 నాటి ఫొటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు.వెలిగొండ మొదటి దశ పూర్తవడంతో ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సాగునీటి పరిస్థితుల్లో గణనీయమైన మార్పు వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దశ ద్వారా సుమారు 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంది. దీంతో వర్షాలపై ఆధారపడే రైతులకు ఎంతో ఊరట లభించనుంది. వ్యవసాయానికి నీటి లభ్యత పెరగడంతో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు కూడా మెరుగుపడే అవకాశం ఉంది.తాగునీటి విషయంలోనూ ఈ ప్రాజెక్టు కీలక ప్రయోజనాన్ని అందించనుంది. సుమారు నాలుగు లక్షల మంది ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రాజెక్టు ఉపయోగపడనుంది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 10.7 టీఎంసీల కృష్ణా వరద జలాలను నల్లమలసాగర్ రిజర్వాయర్‌కు తరలించేందుకు తొలి దశ మార్గం సుగమం చేస్తుంది.ప్రకాశం, నెల్లూరు , కడప జిల్లాల్లోని ఫ్లోరైడ్ ప్రభావిత, కరవు ప్రాంతాలకు సురక్షితమైన తాగునీటిని అందించడంలో కూడా వెలిగొండ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. భూములు ఇచ్చిన రైతులకు విడతల వారీగా పరిహారం అందించామని చంద్రబాబు తెలిపారు. గతంలో ప్రాజెక్టు పూర్తికాకుండానే పూర్తయినట్లు ప్రచారం చేశారని ఆయన విమర్శించారు. ఇప్పుడు నిజంగా పనులను పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం అందించడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది. మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించే ఈ ప్రాజెక్టు ప్రారంభం ప్రకాశం జిల్లా అభివృద్ధిలో కీలక మలుపుగా నిలిచే అవకాశం ఉంది.

# నగరిపై గురి...

**తిరుపతి, ఆగస్టు 27, పెన్ పవర్:**
ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ) నాయకురాలు, మాజీ మంత్రి ఆర్కే రోజా కు ఈ ఎన్నికలు కీలకంగా మారే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఓటమి తర్వాత నగరి రాజకీయాల్లో పరిస్థితులు మారాయి. తెలుగుదేశం పార్టీ ( నుంచి గాలి భాను ప్రకాష్ నాయుడు ) విజయం సాధించడంతో నియోజకవర్గంలో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడ్డాయి.అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను రోజా పెద్దగా పట్టించుకోనప్పటికీ, ఇప్పుడు జరగబోయే మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఆమె రాజకీయ ప్రభావానికి ఒక కొలమానంగా మారవచ్చని స్థానికంగా చర్చ సాగుతోంది. దీంతో నగరి మున్సిపాలిటీపై వైసీపీ ఎలా వ్యూహం రచిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఎమ్మెల్యే భాను ప్రకాష్ మాత్రం ఈ ఎన్నికలను తనకు వచ్చిన అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది.నగరి పట్టణంలోని ప్రతి వార్డులో టీడీపీ బలాన్ని పెంచేందుకు భాను ప్రకాష్ నాయుడు విస్తృతంగా పర్యటిస్తున్నారు. కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు స్థానిక ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. ఇప్పటికే పరిష్కరించిన సమస్యలను ప్రజలకు వివరిస్తూ, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపై హామీలు ఇస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని మున్సిపల్ స్థాయిలోనూ పునరావృతం చేయాలన్న లక్ష్యంతో ఆయన ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.రోజాను లక్ష్యంగా చేసుకుని భాను వర్గం చేస్తున్న రాజకీయ విమర్శలు కూడా చర్చకు వస్తున్నాయి. ఆమె నియోజకవర్గానికి తరచూ రావడం లేదంటూ 'విజిటింగ్ లీడర్' అనే ప్రచారాన్ని టీడీపీ వర్గాలు తెరపైకి తెస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న అంశాన్ని కూడా ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించే అవకాశం ఉంది. గతంలో చోటుచేసుకున్న ఆడుదాం వ్యవహారం కూడా రాజకీయంగా చర్చకు వస్తోందినగరిలో జనసేన కు కూడా కొంత ప్రభావం ఉంది. అయినప్పటికీ టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఉండటం భాను ప్రకాష్‌కు అదనపు బలంగా మారే అవకాశం కనిపిస్తోంది. స్థానిక ఎన్నికల్లో ఎమ్మెల్యేలకు ఎక్కువ బాధ్యతలు అప్పగించిన పరిస్థితుల్లో మున్సిపల్ ఫలితం తన నాయకత్వానికి కూడా ప్రతిబింబంగా ఉంటుందని భావిస్తూ ఆయన మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.మరోవైపు రోజా మాత్రం ఇప్పటివరకు మున్సిపల్ ఎన్నికలపై పెద్దగా దృష్టి పెట్టలేదనే అభిప్రాయం ఉంది. నియోజకవర్గంలో ఆమె కార్యక్రమాలు తక్కువగా కనిపించడం వైసీపీకి ఇబ్బందిగా మారే అవకాశముంది. దీనికి తోడు పార్టీలోని అంతర్గత విభేదాలు కూడా ఆమెకు సవాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరి మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ ఎంతవరకు తన పాత ప్రభావాన్ని నిలబెట్టుకుంటుందో, టీడీపీ కొత్త బలంతో ఎలాంటి ఫలితాన్ని సాధిస్తుందో చూడాలి. ఫలితం రోజా రాజకీయ భవిష్యత్తుపై, భాను ప్రకాష్ స్థానిక నాయకత్వంపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## ఉత్తరాంధ్రలో రియల్ జోరు

**విశాఖపట్టణం, ఆగస్టు 27, పెన్ పవర్:** ఉత్తరాంధ్ర పారిశ్రామిక కేంద్రమైన శ్రీకాకుళం జిల్లా పరిధిలోని పైడిభీమవరం, ఎచ్చెర్ల బెల్ట్‌లో స్థిరాస్తి వ్యాపారం మళ్లీ వేగం పుంజుకుంది. జాతీయ రహదారి అనుసంధానంతో ఉన్న ఈ కారిడార్‌లో ఫార్మా రంగానికి చెందిన ప్రముఖ కంపెనీల విస్తరణ పనులు ఊపందుకోవడంతో నివాస స్థలాలకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. పారిశ్రామిక వేత్తలు, కంపెనీల ఉద్యోగులతో పాటు స్థానిక ఇన్వెస్టర్లు ఈ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుండటంతో లేఅవుట్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి.పైడిభీమవరం పారిశ్రామిక రంగానికి గుండెకాయ లాంటిది కావడంతో అక్కడ పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులు, టెక్నీషియన్లకు శాశ్వత నివాసాలు కల్పించే దిశగా ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థలు సరికొత్త వెంచర్లను అందుబాటులోకి తెస్తున్నాయి. వీటికి తోడు ఎచ్చెర్ల పరిసర ప్రాంతాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయంతో పాటు పలు ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు కొలువై ఉండటంతో ఈ ప్రాంతం ఎడ్యుకేషనల్ అండ్ ఇండస్ట్రియల్ హబ్‌గా రూపాంతరం చెందింది. ఈ విద్యా, పారిశ్రామిక వాతావరణమే ఇక్కడ హౌసింగ్ లేఅవుట్ల విక్రయాలు పుంజుకోవడానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది.మరొకవైపు విశాఖపట్నం-భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ కారిడార్ ప్రభావం శ్రీకాకుళం జిల్లా సరిహద్దుల వరకు విస్తరించడంతో ఇక్కడ భూముల విలువలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో జాతీయ రహదారికి ఇరువైపులా విఆర్డిఎ అనుమతులు పొందిన లేఅవుట్లు పెద్ద ఎత్తున రూపుదిద్దుకుంటున్నాయి. తక్కువ ధరకే ప్లాట్లు దొరకడం, భవిష్యత్తులో మంచి రాబడి ఇచ్చే అవకాశం ఉండటంతో మధ్యతరగతి గృహ కొనుగోలుదారులు ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు.ముగింపుగా చూస్తే, పైడిభీమవరం-ఎచ్చెర్ల పారిశ్రామిక కారిడార్ శ్రీకాకుళం జిల్లాలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న స్థిరాస్తి కేంద్రంగా మారుతోంది. ప్రభుత్వం కూడా ఈ కారిడార్‌లో రవాణా వసతులు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తుండటంతో రాబోయే రోజుల్లో ఇక్కడ నివాస గృహాల నిర్మాణాలు మరింత ఊపందుకుంటాయని, ఇది జిల్లా ఆర్థిక పురోగతికి మరింత తోడ్పడుతుందని స్థానిక స్థిరాస్తి నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## శ్రీశైలం దేవస్థానంలో భారీ ప్రక్షాళన..

**కర్నూలు, ఆగస్టు 27, పెన్ పవర్:** :శ్రీశైలం దేవస్థానంలో వరుస వివాదాల నేపథ్యంలో భారీ ప్రక్షాళన ప్రారంభమైంది. పరిపాలనలో సమర్థత, పారదర్శకత కోసం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు 37 మంది ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పులు దేవస్థానం దైనందిన కార్యకలాపాల్లో మెరుగైన సమన్వయాన్ని తీసుకువస్తాయని అంచనా. నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.నంద్యాల జిల్లా శ్రీశైలం దేవస్థానంలో వరుస వివాదాల నేపథ్యంలో భారీ స్థాయిలో అంతర్గత బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. పరిపాలనలో మార్పులు, విధుల నిర్వహణలో సమన్వయం కోసం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు 37 మంది ఉద్యోగులను స్థానికంగా అంతర్గత బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షణ స్థాయి అధికారి నుంచి అటెండర్, హెల్పర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వరకు వివిధ కేటగిరీలకు చెందిన సిబ్బంది ఈ బదిలీల్లో ఉన్నారు.దేవస్థానం పరిపాలన సౌలభ్యం, విధుల సమర్థవంతమైన నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఈ అంతర్గత బదిలీలు చేపట్టినట్లు ఈఓ శ్రీనివాసరావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఇతర విభాగాలు, స్థానాల్లోకి మార్చడంతో పరిపాలనా వ్యవస్థలో కొత్త సమీకరణాలు చోటుచేసుకోనున్నాయి.బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే సంబంధిత ఉద్యోగులు ప్రస్తుతం నిర్వహిస్తున్న విధుల నుంచి రిలీవ్ అయి, ఉత్తర్వుల్లో కేటాయించిన నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఈఓ స్పష్టం చేశారు. ఉద్యోగుల విధుల మార్పు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని అధికార యంత్రాంగం ఆదేశించింది.ఇటీవల శ్రీశైలం దేవస్థానంలో పలు అంశాలు వివాదాలకు దారితీసిన నేపథ్యంలో తాజా బదిలీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈఓ శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధతో ఈ బదిలీల ప్రక్రియను నిర్వహించినట్లు ఉద్యోగుల వర్గాల్లో సమాచారం వినిపిస్తోంది. మొత్తంగా 37 మంది ఉద్యోగుల స్థానిక అంతర్గత బదిలీలతో శ్రీశైలం దేవస్థానంలో పరిపాలనా వ్యవస్థలో మార్పులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ మార్పుల అనంతరం దేవస్థానం రోజువారీ పరిపాలన, ఉద్యోగుల విధుల నిర్వహణలో మరింత సమన్వయం ఏర్పడుతుందా అన్నది వేచి చూడాల్సి ఉంది..!

## కొత్త దనం లేని జగన్ ప్రెస్ మీట్

**విజయవాడ, ఆగస్టు 27, పెన్ పవర్:** :వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి వారానికి ఒక్కసారి ప్రెస్ మీట్ పెడుతున్నారు. అయితే స్వల్ప వ్యవధిలో ఇలా ప్రెస్ మీట్ పెడుతుండడంతో పెద్దగా ఆసక్తికరమైన అంశాలు ఆయన మాట్లాడలేకపోతున్నారు. కనీసం నెలకోసారి ఇలా ప్రెస్ మీట్ పెడితే కొంత కొత్తదనం ఉండేది. పార్టీ నేతలతో ముందురోజు మాట్లాడుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి వారానికి ఒక్కసారి ప్రెస్ మీట్ పెడుతున్నారు. అయితే స్వల్ప వ్యవధిలో ఇలా ప్రెస్ మీట్ పెడుతుండడంతో పెద్దగా ఆసక్తికరమైన అంశాలు ఆయన మాట్లాడలేకపోతున్నారు. కనీసం నెలకోసారి ఇలా ప్రెస్ మీట్ పెడితే కొంత కొత్తదనం ఉండేది. పార్టీ నేతలతో ముందురోజు మాట్లాడుతున్నారు. ఆ వీడియోలు బయటకు వస్తున్నాయి. ఆ తరువాత రోజు ప్రెస్ మీట్ పెట్టుకుని కొన్ని రకాల స్క్రిప్టులను చూసి మాట్లాడుతున్నారు. అందులో కొత్తదనం ఏమీ కనిపించడం లేదు. అటు తిరిగి ఇటు తిరిగి చంద్రబాబు ప్రభుత్వాన్ని తప్పు పట్టడం.. అవి తమ హయాంలోనే బాగా అమలు చేశామని చెప్పడం వంటివి మాత్రమే జరుగుతున్నాయి. ఈ వారాంతపు ప్రెస్ మీట్ లో కూడా అదే పరిస్థితి కనిపించింది.బీసీ రిజర్వేషన్ల అంశంపై జగన్మోహన్ రెడ్డి మరోసారి రాజకీయ విమర్శలు చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో రెండు డిప్యూటీ సీఎం పదవులతో పాటు కేబినెట్ లోని 25 మందిలో 11 మంది బీసీలకు ఇచ్చామని గుర్తు చేశారు. 40 శాతం మంత్రి పదవులకు వారికి కేటాయించామని ప్రస్తావించారు. అప్పట్లోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధపడితే కోర్టుల ద్వారా చంద్రబాబు అడ్డుకున్నారంటూ చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న కోర్టు తీర్పులను ప్రస్తావిస్తూ.. కూటమి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పేరుతో గ్రామాలకు దిగుతోందని ఆరోపించారు. అయితే ఇప్పుడు న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి బీసీ రిజర్వేషన్లు 34% కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దానిని స్వాగతించాల్సింది పోయి గతంలో తాను గొప్పగా చేశానని చెప్పుకునే ప్రయత్నం చేశారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఎలా నడుచుకుంది బలహీన వర్గాలకు తెలుసు.జగన్మోహన్ రెడ్డి మీడియా సమావేశాలు అంటేనే ముఖ్యంగా మీడియా ప్రతినిధులకు ఆసక్తి తగ్గిపోయింది. మెయిన్ మీడియా కంటే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లకు, రీల్స్ లో, ఇన్స్టాగ్రామ్ లో ఉన్నవారికి ఆసక్తి. ఇప్పుడు జగన్ చేసే వ్యాఖ్యలకు.. ఆయన హయాంలో జరిగిన పరిణామాలను జత పోలుస్తూ మీమ్స్ ఓ రేంజ్ లో వేసుకుంటారు. సోషల్ మీడియా తెరిస్తే అదే పనిగా జగన్ పైనే రీల్స్ కనబడుతూ ఉంటాయి. అందుకే వారాంతపు మీడియా సమావేశాలు మాత్రం బోర్ కొడుతున్నాయి. రాతపూర్వక స్క్రిప్టులు చదవడం తప్ప ప్రజలకు కొత్తగా చెప్పేదేమీ లేకుండా పోతోంది. అది కూడా సొంత అనుబంధ మీడియా ఛానల్ లైవ్ కవరేజ్ ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోతోంది. జగన్ మీడియా సమావేశాన్ని జనాలు లైట్ తీసుకుంటున్నారు. ఆయన చెప్పిన దాంట్లో విశ్వసనీయత కంటే మరో కోణంలో వెతుకులాట ఎక్కువగా కనిపిస్తోంది. ఇక తెలుసుకోవాల్సింది ఆయన మాత్రమే.

## కొండాపై యాక్షన్ తీసుకునే ధైర్యం చేస్తారా

**హైదరాబాద్, ఆగస్టు 27, పెన్ పవర్:** కొండా సురేఖ, చిన్నారెడ్డిల పదవులను తీసేయాలని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేసింది. నివేదికను హైకమాండ్ కు పంపించారు. కానీ నిర్ణయం ఎప్పుడు వస్తుందో చెప్పడం కష్టం. తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలను, ప్రత్యేకించి పార్టీ అధిష్ఠానం నడుచుకునే తీరును పరిశీలిస్తే.. క్రమశిక్షణారాహిత్యంపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఆ పార్టీ చూపే ఆచితూచి అడుగులు వేసే వైఖరి స్పష్టంగా కనిపిస్తుంది. క్రమశిక్షణ తప్పిన నేతలపై వెంటనే వేటు వేయకుండా, వారు పార్టీకి తీవ్ర స్థాయిలో నష్టం చేకూర్చే వరకు లేదా స్వయంగా నిష్క్రమించే వరకు వేచి చూడటం కాంగ్రెస్ సాంప్రదాయ శైలిగా మారింది.తీన్మార్ మల్లన్న ఉదంతమే ఇందుకు తాజా ఉదాహరణ. బిసి కులగణన నివేదికను పబ్లిక్‌గా నిరసిస్తూ చించివేసినా, పార్టీ విధానాలపై బహిరంగ వ్యాఖ్యలు చేసినా, అధిష్ఠానం తక్షణమే చర్యలకు దిగలేదు. షోకాజ్ నోటీసులు జారీ చేసి సస్పెన్షన్ వేటు వేసే సమయానికి, జరగాల్సిన రాజకీయ నష్టం జరిగిపోయింది. మల్లన్న శైలిని గమనిస్తే ఆయన ఉద్దేశపూర్వకంగానే సస్పెన్షన్ పొందేలా తీవ్ర వ్యాఖ్యలు చేశారని, అంతవరకు పార్టీ లోపల ఉంటూనే వ్యతిరేక స్వరాలు వినిపించారనే అభిప్రాయం వ్యక్తమైంది.అదేవిధంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి సీనియర్ నేతలు పార్టీ నాయకత్వంపై పదే పదే విమర్శలు చేసిన సందర్భాల్లోనూ, క్రమశిక్షణా కమిటీ కేవలం నోటీసులతో కాలయాపన చేయడం తప్ప, తీవ్రమైన రాజకీయ ముగింపు ఇవ్వలేకపోయింది.ఈ తరహాలో చర్యలు తీసుకోకపోవడం వెనుక కాంగ్రెస్ అధిష్ఠానానిది బలహీనతా లేక వ్యూహమా అనేది ఆసక్తికరమైన ప్రశ్న. స్థానిక ప్రాంతీయ నాయకత్వం అతిగా బలోపేతం కాకుండా, నిరంతరం అంతర్గత వ్యతిరేకత ఉంచడమే హైకమాండ్ ప్రాథమిక ప్రణాళిక అని భావిస్తారు. ప్రాంతీయంగా ఒకే నాయకుడు తిరుగులేని శక్తిగా మారితే అధిష్ఠానంపై ఆధిక్యత సాధిస్తారనే ముందస్తు భయంతో, అసమ్మతి స్వరాలను పూర్తిగా అణచివేయకుండా సజీవంగా ఉంచడం కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘకాలంగా అనుసరిస్తున్న వ్యూహం.ప్రస్తుత రేవంత్ రెడ్డి సర్కారులో ఈ వైఖరి కొత్త సవాళ్లను తెచ్చిపెడుతోంది. ప్రభుత్వాన్ని నడుపుతున్న ముఖ్యమంత్రిపై లేదా కేబినెట్ సహచరులపై సొంత పార్టీ నేతలు గళమెత్తినప్పుడు అధిష్ఠానం చూపే నిర్లిప్తత, తిరుగుబాటు చేసినా తక్షణ పరిణామాలు ఉండవు అనే భరోసాను అసమ్మతి వర్గానికి ఇస్తోంది. కఠిన చర్యల స్థానంలో ఏఐసీసీ ఇన్‌ఛార్జీల ద్వారా బుజ్జగింపు రాజకీయాలు , కమిటీల ఏర్పాటు వంటి తాత్కాలిక పరిష్కారాలు అనుసరించడం వల్ల సమస్యలు సర్దుమణగకపోగా, స్థానిక నాయకత్వ పట్టు సడలిపోతోంది. సమగ్రంగా చూస్తే, పార్టీలో అసమ్మతిని నియంత్రించడంలో కాంగ్రెస్ చూపుతున్న కాలయాపన విధానం దెబ్బలను మరింత పెంచుతుందే తప్ప నయం చేయలేకపోతోంది. కానీ ఆ పార్టీ తీరులో మాత్రం మార్పు రావడం లేదు. మరో వైపు తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ చుట్టూ ముసిరిన వివాదం హైకమాండ్ వద్దకు చేరింది. పార్టీ అంతర్గత వ్యవహారాలు, ప్రభుత్వంపై వచ్చిన విమర్శల నేపథ్యంలో ఏఐసీసీ దృష్టికి చేరిన ఈ వ్యవహారంలో అధిష్ఠానం తీసుకోబోయే నిర్ణయమే అత్యంత కీలకంగా మారింది. పార్టీ క్రమశిక్షణా కమిటీ , ఢిల్లీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని, హైకమాండ్ ఆదేశాల తర్వాతే తన తదుపరి రాజకీయ అడుగులు ఉంటాయని కొండా సురేఖ తన అనుచరులు, సన్నిహితుల వద్ద స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.ఈ వివాదంలో తన కుమార్తె సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలపై వస్తున్న ఆరోపణలను కొండా సురేఖ తీవ్రంగా ఖండిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# మాజీ సీఎం కిరణ్ కి బీజేపీ బంపర్ ఆఫర్ ?



ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కి చిట్ట చివరి సీఎం గా పనిచేసిన రికార్డు సొంతం చేసుకున్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి పుష్కర కాలంగా పదవీ యోగం పట్టకుండా పోయింది. 2014 మార్చిలో ఆయన సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తరువాత సమైక్యాంధ్ర పార్టీని ఏర్పాటు చేసి ఏపీ ఎన్నికల్లో పోటీ చేసిన ఫలితం లేకపోయింది. కాంగ్రెస్ లో తిరిగి చేరినా ప్రాధాన్యత దక్కలేదని బయటకు వచ్చేశారు, బీజేపీలో చేరితే 2024 ఎన్నికల్లో రాజంపేట లోక్ సభ ఎన్నికల్లో గెలుపు పిలుపు వినిపించలేదు. దాంతో రాజ్యసభ సీటు కోసం కిరణ్ కుమార్ ప్రయత్నం చేస్తున్నారు అని ప్రచారం అయితే ఊపందుకుంది. ఆ విధంగా పెద్దల సభలో చేరి కేంద్ర మంత్రి కావాలన్నది ఆయన ఆలోచన. అయితే అది కూడా తీరకుండా పోతోంది.

**గోల్డెన్ చాన్స్ దక్కేనా :**

ఈ నేపథ్యంలో కేంద్ర పెద్దలతో కిరణ్ కుమార్ టచ్ లో ఉంటున్నారు అని అంటున్నారు. అయితే ఆయన నిబద్ధత నిజాయతీ అంకిత భావం వంటివి బీజేపీ పెద్దలను ఆకట్టుకున్నాయని చెబుతున్నారు. మాటకు కట్టుబడి ఉండే నైజంతో పాటు రాయలసీమలో బలమైన సామాజిక వర్గానికి చెందిన కిరణ్ కుమార్ రెడ్డి సేవలను పరోక్షంగా వినియోగించుకోవాలని బీజేపీ పెద్దలు తలపోస్తున్నారు. దాంతో ఆయనకు ఆయన హోదాకు తగినట్లుగా సముచితమైన స్థానం కల్పించాలని భావిస్తున్నారు. ఉమ్మడి ఏపీకి సీఎం గా పనిచేసిన కిరణ్ కుమార్ రెడ్డిని ఒక కీలక రాష్ట్రానికి గవర్నర్ గా నియమించాలని కేంద్ర పెద్దలు ఆలోచిస్తున్నారు అని అంటున్నారు.

**ఖాళీలలో ఒకటి ఖాయం :**

ఇక దేశంలో త్వరలో పలు రాష్ట్రాలలో గవర్నర్ పదవులకు ఖాళీలు ఏర్పడతాయి. దాంతో వాటిలో ఒక పదవికి ఏపీకి చెందిన కిరణ్ కుమార్ రెడ్డికి ఇస్తారని ఢిల్లీ స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. సీనియర్ నాయకుడిగా దశాబ్దాల కాలం అనుభవం కలిగిన కిరణ్ కుమార్ రెడ్డి స్పీకర్ గా కూడా పనిచేశారు. దాంతో రాజ్యాంగబద్ధ హోదాతో ఆయనను రాజ్ భవన్ కి పంపించాలని చూస్తున్నారు అని అంటున్నారు. అదే జరిగితే కిరణ్ కుమార్ రెడ్డి జాక్ పాట్ కొట్టినట్లే అని అంటున్నారు. కీలక రాష్ట్రానికి గవర్నర్ గా బాధ్యతలు చేపట్టడం అంటే ఆయన హోదాకు అది సముచితమైన గౌరవం అని అంటున్నారు. అయితే దీని మీద అధికారికంగా ఎక్కడా సమాచారం అయితే లేదు, గతంలోనూ పలు మార్లు కిరణ్ కుమార్ రెడ్డి పేరు గవర్నర్ల జాబితాలో పరిశీలనలోకి వచ్చినా కూడా చివరి నిముషంలో అది జరగలేదు, అయితే ఈసారి ఖాయమని ఆయన వర్గీయులలో అయితే ఆశాభావం వ్యక్తం అవుతోంది.

**సెప్టెంబర్లో నే అన్నీ :**

బీజేపీ సెప్టెంబర్ నెలలోనే కీలక మార్పులు అన్నీ చేస్తుందని చెబుతున్నారు. కేంద్ర మంత్రి వర్గ విస్తరణ జరపడం, అందులో సీనియర్లు పలువురిని గవర్నర్లుగా నియమించడంతో పాటు ఏపీకి చెందిన సీనియర్ బీజేపీ నేత కిరణ్ కుమార్ రెడ్డికి కూడా చోటు కల్పిస్తారు అని అంటున్నారు. ఇక ఇదే వరసలో టీడీపీ నుంచి ఒకరికి గవర్నర్ పోస్టు బీజేపీ ఇచ్చే చాన్స్ ఉండొచ్చు అని అంటున్నారు. మరి టీడీపీ నుంచి ఎవరు ఆ అదృష్టవంతులు అన్నది తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా సెప్టెంబర్ నెల రాజకీయంగా చాలా కీలకంగా మారబోతోంది అన్నది నిజమని హస్తిన వర్గాలు చెబుతున్నాయి.

# యాదాద్రి గుడిలోనూ ఆంధ్రా- తెలంగాణ వివాదమా? కవిత తీరుపై మండిపాటు

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత యాదాద్రి దేవస్థానం బోర్డు నియామకాలపై.. ప్రముఖ నటుడు చిరంజీవి సతీమణికి ఇచ్చిన పదవిపై చేసిన పరోక్ష వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. దశాబ్ద కాలం కిందటి ప్రాంతీయ విభజన రేఖలను మళ్లీ గీసేలా ఆమె మాట్లాడటంపై సామాజిక వర్గాలు, మేధావుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రాజకీయ ఉనికి కోసం పాత మంత్రమేనా?**

తెలంగాణ సాధన సఫలీకృతమై ఎన్నో ఏళ్లు గడిచినా.. ఇంకా "ఆంధ్రా–తెలంగాణ" ముద్రలతో విద్వేషాలను రగిలించే ప్రయత్నం చేయడం కవిత రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భక్తి, దేవాలయాలకు ప్రాంతీయ విద్వేషాలను ఆపాదించడం ప్రజాస్వామ్యంలో ఏమాత్రం సమంజసం కాదనే నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

**చిరంజీవి సెటిల్ అయ్యింది తెలంగాణలోనే..**

చిరంజీవి కుటుంబం చెన్నై వదిలిన తర్వాత దశాబ్దాలుగా హైదరాబాద్‌లోనే స్థిరపడింది. వారి పిల్లలు ఇక్కడే పెరిగారు.. ఇక్కడే నటులుగా గుర్తింపు పొందారు. ఆస్తులు, వ్యాపారాలు, జీవితం అంతా తెలంగాణతోనే ముడిపడి ఉన్నప్పుడు.. ఇంకా వారిపై 'ఆంధ్ర' ముద్ర వేయడం ఎంతవరకు సమంజసం? అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. కవిత వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తున్నారు. చిరంజీవి సతీమణి పుట్టి పెరిగిన ప్రాంతం ఆంధ్రా కావచ్చు, కానీ ఆమె నివాస ప్రాంతం హైదరాబాద్. తెలంగాణలోనే జీవిస్తూ ఈ ప్రాంతంతో మమేకమైన వారిని కూడా "పరాయి"వారిగా చూడటం సంకుచిత మనస్తత్వానికి అద్దం పడుతోంది. యాదాద్రి దేవస్థానంలో ఒక ప్రముఖురాలికి పదవి ఇస్తే, దానిని ప్రాంతీయ హక్కుల పోరాటంగా చిత్రీకరించడం సమర్థనీయం కాదు. ఆధ్యాత్మిక క్షేత్రాలు అందరికీ సమానమేనన్న కనీస ధర్మాన్ని ఇక్కడ విస్మరించారు.

**అభివృద్ధి రాజకీయం కావాలో.. ప్రాంతీయ విద్వేషాలు కావాలో..**

తెలంగాణ ప్రయోజనాలు, స్థానికులకు ప్రాధాన్యత అనే నెపంతో పాత వివాదాలను మళ్లీ తెరపైకి తెచ్చి ప్రజల మధ్య చీలికలు తేగలమని భావించడం భ్రమ మాత్రమే. తెలంగాణ ప్రజలు ఈ తరహా ప్రాంతీయ విద్వేష రాజకీయాలను ఎప్పుడో దాటి ముందుకు వెళ్లారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యలపై దృష్టి సారించి రాజకీయాలు చేయాల్సింది పోయి.. దేవాలయాల వేదికగా ప్రాంతీయ ముద్రలు వేస్తూ వివాదాలు సృష్టించడం తెలంగాణ రాజకీయ సంస్కృతికే మచ్చ అని నెటిజన్లు, విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో రాజకీయంగా ప్రాధాన్యం పొందిన ఆంధ్రా, తెలంగాణ అంశాలను మరోసారి తెరపైకి తీసుకురావడం వల్ల ప్రజల్లో ప్రాంతీయ విభేదాలు పెరిగే అవకాశం ఉందని కొందరు మేధావులు, నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర విభజన జరిగిన ఎన్నో సంవత్సరాల తర్వాత కూడా ఇలాంటి అంశాలను రాజకీయంగా ఉపయోగించుకోవడం అవసరమా అని ప్రశ్నిస్తున్నారు.

మొత్తంగా యాదాద్రి దేవస్థానం అంశంతో మొదలైన ఈ వివాదం మరోసారి ఆంధ్రా, తెలంగాణ ప్రాంతీయ రాజకీయాలపై చర్చకు తెరతీసింది. కవిత వ్యాఖ్యలు నిజంగా తెలంగాణ హక్కుల పరిరక్షణలో భాగమా? లేక పాత ప్రాంతీయ విభేదాలను మళ్లీ రెచ్చగొట్టే ప్రయత్నమా? అనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది.

# బలూచ్ దెబ్బ.. ఇరాన్ సాయం కోరిన పాకిస్తాన్

బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వరుస దాడులతో పాకిస్థాన్‌లో భద్రతా పరిస్థితులు తీవ్ర ఆందోళనకరంగా మారాయి. ముఖ్యంగా వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన బలూచిస్థాన్ ప్రాంతంలో వేర్పాటువాద గ్రూపుల కార్యకలాపాలు ఊపందుకోవడం పాకిస్థాన్ సైన్యానికి గుండెనొప్పిగా పరిణమించింది. పాక్–ఇరాన్ సరిహద్దులనే కేంద్రంగా చేసుకుని బీఎల్ఏ ఫైటర్లు తమ ఆపరేషన్లను నిర్వహిస్తున్నారన్న అనుమానాలు ఇస్లామాబాద్ వర్గాలను తీవ్రంగా కలవరపెడుతున్నాయి. స్వాతంత్ర్యం కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న బలూచ్ ఉద్యమం.. ఇటీవల తమ స్వతంత్రతను చాటుతూ ప్రత్యేక రోజులను ప్రకటించుకోవడంతో మరోసారి అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. బీఎల్ఏ తో పాటు ఇతర వేర్పాటువాద గ్రూపులు కూడా పాక్ భద్రతా బలగాలే లక్ష్యంగా దాడులకు తెగబడుతుండటంతో పాక్ ఆర్మీ తీవ్ర ఒత్తిడిలోకి నెట్టబడింది.
ాతీఉటఅఝశ్రీ ×త్వశ్రీఅస్త్రవఅఎవ బంవంఈ ఆకస్మిక భద్రతా సంక్షోభం నుంచి బయటపడేందుకు పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ ఇరాన్ సహకారాన్ని కోరినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. సరిహద్దు ప్రాంతాల నుండి బలూచ్ మిలిటెంట్లు పాకిస్థాన్ భూభాగంలోకి చొరబడకుండా అడ్డుకోవడం.. అలాగే వేర్పాటువాదులకు అందుతున్న ఆర్థిక, ఆయుధ మద్దతును పూర్తిగా నిలిపివేయడంలో ఇరాన్ సహాయాన్ని పాకిస్థాన్ ఆశిస్తోంది. సరిహద్దుల్లో ఉమ్మడి నిఘాను పెంచడం ద్వారా మాత్రమే మిలిటెంట్ల కదలికలను అరికట్టవచ్చని ఇస్లామాబాద్ భావిస్తోంది.అయితే ఈ వ్యవహారంలో ఇరాన్ తీసుకునే నిర్ణయం అత్యంత కీలకంగా



మారింది. ఇరాన్‌లోని సిస్తాన్–బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో కూడా బలూచ్ జనాభా విస్తరించి ఉండటం, గతంలో అక్కడ కూడా మిలిటెంట్ కార్యకలాపాలు ఇరాన్ భద్రతా బలగాలకు సవాలుగా మారడంతో పాకిస్థాన్ అభ్యర్థనను ఇరాన్ పూర్తిగా విస్మరించే పరిస్థితి లేదు. అయినప్పటికీ ప్రస్తుతం అంతర్జాతీయంగా అమెరికాతో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలోని భౌగోళిక–రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ ప్రతి అడుగూ అత్యంత వ్యూహాత్మకంగా వేస్తోంది. పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలు కాపాడుకుంటూనే తన సొంత ప్రాంతీయ భద్రతా ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు కత్తిమీద సాములా మారింది. మొత్తం మీద బలూచ్ వేర్పాటువాదం పాకిస్థాన్‌కు కేవలం ఒక అంతర్గత భద్రతా సమస్యగానే కాకుండా పొరుగు దేశాలతో ఉండే సరిహద్దు, దౌత్య సంబంధాలను ప్రభావితం చేసే ప్రధాన సవాలుగా పరిణమించింది. రాబోయే రోజుల్లో బీఎల్ఏ తీవ్రవాదాన్ని పాక్ సైన్యం ఎలా కట్టడి చేస్తుంది.. ఈ విషయంలో ఇరాన్ పాకిస్థాన్‌కు ఎంతవరకు ప్రత్యక్షంగా సహకరిస్తుంది అనేది అత్యంత ఆసక్తికరంగా మారింది.


# బలూచ్ దెబ్బ.. ఇరాన్ సాయం కోరిన పాకిస్తాన్





బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వరుస దాడులతో పాకిస్థాన్‌లో భద్రతా పరిస్థితులు తీవ్ర ఆందోళనకరంగా మారాయి. ముఖ్యంగా వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన బలూచిస్థాన్ ప్రాంతంలో వేర్పాటువాద గ్రూపుల కార్యకలాపాలు ఊపందుకోవడం పాకిస్థాన్ సైన్యానికి గుండెనొప్పిగా పరిణమించింది. పాక్–ఇరాన్ సరిహద్దులనే కేంద్రంగా చేసుకుని బీఎల్ఏ ఫైటర్లు తమ ఆపరేషన్లను నిర్వహిస్తున్నారన్న అనుమానాలు ఇస్లామాబాద్ వర్గాలను తీవ్రంగా కలవరపెడుతున్నాయి. స్వాతంత్ర్యం కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న బలూచ్ ఉద్యమం.. ఇటీవల తమ స్వతంత్రతను చాటుతూ ప్రత్యేక రోజులను ప్రకటించుకోవడంతో మరోసారి అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. బీఎల్ఏ తో పాటు ఇతర వేర్పాటువాద గ్రూపులు కూడా పాక్ భద్రతా బలగాలే లక్ష్యంగా దాడులకు తెగబడుతుండటంతో పాక్ ఆర్మీ తీవ్ర ఒత్తిడిలోకి నెట్టబడింది.
ాతీఉటఅఝశ్రీ ×త్వశ్రీఅస్త్రవఅఎవ బంవం ఈ ఆకస్మిక భద్రతా సంక్షోభం నుంచి బయటపడేందుకు పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ ఇరాన్ సహకారాన్ని కోరినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. సరిహద్దు ప్రాంతాల నుండి బలూచ్ మిలిటెంట్లు పాకిస్థాన్ భూభాగంలోకి చొరబడకుండా అడ్డుకోవడం.. అలాగే వేర్పాటువాదులకు అందుతున్న ఆర్థిక, ఆయుధ మద్దతును పూర్తిగా నిలిపివేయడంలో ఇరాన్ సహాయాన్ని పాకిస్థాన్ ఆశిస్తోంది. సరిహద్దుల్లో ఉమ్మడి నిఘాను పెంచడం ద్వారా మాత్రమే మిలిటెంట్ల కదలికలను అరికట్టవచ్చని ఇస్లామాబాద్ భావిస్తోంది.
అయితే ఈ వ్యవహారంలో ఇరాన్ తీసుకునే నిర్ణయం అత్యంత కీలకంగా మారింది. ఇరాన్‌లోని సిస్తాన్–బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో కూడా బలూచ్ జనాభా విస్తరించి ఉండటం, గతంలో అక్కడ కూడా మిలిటెంట్ కార్యకలాపాలు ఇరాన్ భద్రతా బలగాలకు సవాలుగా మారడంతో పాకిస్థాన్ అభ్యర్థనను
ఇరాన్ పూర్తిగా విస్మరించే పరిస్థితి లేదు. అయినప్పటికీ ప్రస్తుతం అంతర్జాతీయంగా అమెరికాతో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలోని భౌగోళిక–రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ ప్రతి అడుగూ అత్యంత వ్యూహాత్మకంగా వేస్తోంది. పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలు కాపాడుకుంటూనే తన సొంత ప్రాంతీయ భద్రతా ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు కత్తిమీద సాములా మారింది. మొత్తం మీద బలూచ్ వేర్పాటువాదం పాకిస్థాన్‌కు కేవలం ఒక అంతర్గత భద్రతా సమస్యగానే కాకుండా పొరుగు దేశాలతో ఉండే సరిహద్దు, దౌత్య సంబంధాలను ప్రభావితం చేసే ప్రధాన సవాలుగా పరిణమించింది. రాబోయే రోజుల్లో బీఎల్ఏ తీవ్రవాదాన్ని పాక్ సైన్యం ఎలా కట్టడి చేస్తుంది.. ఈ విషయంలో ఇరాన్ పాకిస్థాన్‌కు ఎంతవరకు ప్రత్యక్షంగా సహకరిస్తుంది అనేది అత్యంత ఆసక్తికరంగా మారింది.


# ట్రాన్స్‌జెండర్లకు క్రికెట్.. మేల్/ఫిమేల్.. ఏ క్రికెట్ లో ఆడించాలి.. పెద్ద చిక్కొచ్చి పడిందే?

క్రికెట్ ప్రపంచంలో ఇప్పటివరకు అవుట్‌స్వింగ్, ఇన్–స్వింగ్, యార్కర్ల గారడీలను మాత్రమే చూశాం. కానీ ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) విసిరిన కొత్త 'పాలసీ గూగ్లీ'కి మైదానంలో ఆటగాళ్లతో పాటు మైండ్లు కూడా వికెట్లు పడిపోతున్నాయి. మగవారిగా పుట్టి ఆ తర్వాత లింగమార్పిడి చేయించుకున్న ట్రాన్స్‌జెండర్ ప్లేయర్లు అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో ఆడటానికి వీల్లేదంటూ ఐసీసీ పక్కా క్లారిటీ ఇచ్చేసింది. అంటే ఇకపై బోర్డర్ దాటి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాలంటే కేవలం కవర్ డ్రైవ్‌లు, సిక్సర్లు కొడితే సరిపోదు... సర్టిఫికెట్లు, రూల్‌బుక్‌లు ముందేసుకుని బయోలాజికల్ లెక్కలు తేల్చుకోవాల్సిందే..

**ఐసీసీ "నో"... లోకల్ బోర్డుల "సై"**

ఇక్కడే అసలైన ట్విస్ట్ ఉంది. ఈ నిషేధపు తాళం కేవలం అంతర్జాతీయ మ్యాచ్‌లకు మాత్రమే పరిమితం. మరి డొమెస్టిక్ క్రికెట్ సంగతేంటి? అంటే..."మా పని అయిపోయింది. ఇక మీ ఇష్టం" అని ఐసీసీ బంతిని ఆయా దేశాల క్రికెట్ బోర్డుల కోర్టులోకి నెట్టేసింది. దాంతో ఇప్పుడు దేశానికో రూలు, పిచ్‌కో పాలసీ తయారైంది. ఆస్ట్రేలియా బోర్డు మాత్రం "మా రూల్స్ మావి" అంటూ ముందుకెళ్తోంది. ట్రాన్స్‌జెండర్ క్రికెటర్ అనాయా బంగర్‌కు అక్కడ ఆడేందుకు గ్రీన్





సిగ్నల్ లభించడమే దీనికి నిదర్శనం.మన బీసీసీఐ దగ్గరికొచ్చేసరికి స్పష్టమైన విధానం లేక కథ ఇంకా నాన్–స్ట్రైకర్ ఎండ్‌లోనే ఆగిపోయింది.

అసలు ఎవరిని రానివ్వాలి? ఎవరిని వద్దనాలి? అనే దానికి పాలసీ కంటే ముందే ప్రశ్నల బౌన్సర్లు ఎక్కువైపోతున్నాయి.బంతి స్వింగ్ అవుతుందో లేదో గానీ.. పాలసీలు మాత్రం భలే తిరుగుతున్నాయి.అంతర్జాతీయ స్థాయిలో ఆడితే నో... అదే ఆస్ట్రేలియాలో లోకల్ లీగ్ ఆడితే యెస్... మరి ఇండియాలో ఆడితే వికెట్ల మధ్య రన్ అవుట్ టైప్ సస్పెన్స్. ఇలా దేశానికో న్యాయం ఉంటే ప్లేయర్లు ప్రాక్టీస్ నెట్స్‌లో జరగాలా లేక లీగల్ టీమ్ ఆఫీసుల్లో జరగాలా? ఏది ఏమైనా ఒకప్పుడు 'క్రికెట్‌లో ఎవరు గెలవాలి?' అనే నిర్ణయం కేవలం అంపైర్ల వేలి చివర ఉండేది. కానీ ఇప్పుడు 'ఎవరు మైదానంలో దిగాలి?' అని తేల్చే బాధ్యత పాలసీ మేకర్ల చేతిలోకి వెళ్ళిపోయింది. రేపో మాపో మైదానంలోకి దిగేముందు థర్డ్ అంపైర్ నాటౌటా కాదా అని చూడటం మానేసి.. జెండర్ సర్టిఫికెట్ స్క్రీనింగ్ చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. భవిష్యత్తులో ఈ రెంటికి మధ్య సమన్వయం కుదురుతుందో లేక ప్లేయర్లు మ్యాచ్ మధ్యలోనే రూల్‌బుక్స్ పట్టుకుని అంపైర్లతో వాదించాల్సి వస్తుందో వేచి చూడాలి.

విద్యార్థుల ఆందోళన నాటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసి కొన్ని వారాలైంది. పరీక్షా సంస్కరణల కోసం విద్యార్థులు చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించింది, స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని దీన్ని ప్రతిధ్వనిస్తూ, భారత డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాన్ని వినియోగించుకుని పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఇస్తామని ప్రకటించారు. ఇది విద్యార్థులకు ఎందుకు స్వాగతించదగినదో ఎంఓఎస్‌పీఐ సర్వే గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ఒక భారత కుటుంబం తన పిల్లల విద్యపై చేసే ఖర్చులో ప్రయివేట్ కోచింగ్ వాటా 2018లో 12.5 శాతం ఉంటే, ఇప్పుడు 16 శాతానికి పెరిగింది. ఉన్నత మాధ్యమిక స్థాయిలో -అంటే విద్యార్థి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే సమయంలో ఈ వాటా బడ్జెట్‌లో దాదాపు నాలుగోవంతుకు చేరుతుంది. అయితే, చౌక కోచింగ్ ఇచ్చినంత మాత్రాన పరిమిత ప్రయోజనమే ఉంటుంది, ఎందుకంటే నాణ్యమైన వృత్తి విద్య కొన్ని సంస్థలకే పరిమితమై ఉంది. ఉదాహరణకు, ఈ ఏడాది వైద్య విద్య ప్రవేశ పరీక్షకు 22 లక్షలకుపైగా అభ్యర్థులు హాజరవగా, అందుబాటులో ఉన్నది కేవలం 1.4 లక్షల అండర్ గ్రాడ్యుయేట్ సీట్లు మాత్రమే. అందులోనూ టాప్ 50 కాలేజీల్లో 10,000 కంటే తక్కువ సీట్లే ఉన్నాయి. ఇంజినీరింగ్ కాలేజీలకు జరిగే జేఈఈ పరిస్థితి కూడా ఇదే. బహుశా అందుకే, 2011లో అఖిల భారత ఉన్నత విద్యా సర్వే మొదలైనప్పటి నుంచి తొలిసారిగా, 2023-24లో అండర్ గ్రాడ్యుయేట్ నమోదు 93,322 తగ్గింది -ముఖ్యంగా యువకుల్లో. ఉత్తరప్రదేశ్‌లో ఈ క్షీణత అత్యంత తీవ్రంగా కనిపించింది, అక్కడ అండర్‌గ్రాడ్యుయేట్ నమోదు 1.53 లక్షలు తగ్గగా, డిప్లొమా నమోదు 1.38 లక్షలు పెరిగింది. ఆవర్తన శ్రామిక శక్తి సర్వే (పీఎల్ఎఫ్ఎస్) డేటా విశ్లేషణ ప్రకారం, 2025లో 15-29 ఏళ్ల మధ్య వయసున్న ప్రతి వందమంది గ్రాడ్యుయేట్లలో కేవలం 26 మందికి మాత్రమే క్రమమైన జీతం గల ఉద్యోగం ఉంది. ఒప్పందం, సామాజిక భద్రతతో కూడిన జీతంగల ఉద్యోగం కేవలం నలుగురికి మాత్రమే ఉంది. అంటే, యువత ఉపాధి సంక్షోభానికి రెండు కోణాలున్నాయి. ఉద్యోగాలకు సిద్ధమయ్యే దశలోనూ, అసలైన ఉద్యోగాల్లోనూ. కేవలం ఉచిత కోచింగ్ ఈ రెండింటిలో దేన్నీ పరిష్కరించలేదు.

ప్రభుత్వం 6-6.5 శాతం వృద్ధి రేటును గొప్పగా ప్రచారం చేస్తున్నా, భారత ఆర్థిక వ్యవస్థలోని నిర్మాణాత్మక సమస్యలు ఇప్పుడు విస్మరించలేనంత స్పష్టంగా కనిపిస్తున్నాయి. భారత కాలేజీ గ్రాడ్యుయేట్లను ఉద్యోగాల్లోకి తీసుకునేందుకు అత్యంత అనువైన రంగం తయారీ రంగమే అయినా, స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో దీని వాటా ఇప్పటికీ ఆరో వంతు స్థాయిలోనే ఉంది. ప్రభుత్వం చాలాకాలంగా వాగ్దానం చేస్తున్న నాలుగోవంతుకు ఏమాత్రం దగ్గరగా లేదు. 2015 వరకూ దశాబ్దాలుగా స్థిరంగా 17 శాతం వద్ద ఉన్న తయారీ రంగం జీడీపీ వాటా, ఆ తర్వాత ఐదేళ్లలో పడిపోయి 2022 నాటికి 13 శాతానికి చేరింది -'మేక్ ఇన్ ఇండియా' ప్రచారం ఉన్నప్పటికీ. తయారీ రంగంలో ఉపాధి వాటా కూడా 2012లో 12.8 శాతం నుంచి 2024 నాటికి 11.5 శాతానికి పడిపోయింది, 2021 వరకూ తయారీ రంగంలో ఉపాధి సంపూర్ణ సంఖ్యలోనే తగ్గింది -స్వాతంత్ర్యానంతర భారత చరిత్రలో ఇదే మొదటిసారి. అదే సమయంలో, కార్పొరేట్ పెట్టుబడులు 2007-08లో జీడీపీలో

## నిరుద్యోగితే అసలు సమస్య


17.3 శాతం ఉంటే, 2024-25 నాటికి 10.3 శాతానికి పడిపోయాయి. 2019లో కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించినా ప్రైవేటు రంగం స్పందించలేదు. దీనికితోడు, 2024-25లో కార్పొరేట్ లాభాలు 22 శాతానికిపైగా వృద్ధి చెందినా, ఉపాధి కేవలం 1.5 శాతమే పెరగడం, వృద్ధి ఫలాలు కంపెనీలకు మాత్రమే దక్కుతున్నాయని, కార్మికులకు కాదని స్పష్టం చేస్తోంది. 2025-26లో యువత నిరుద్యోగిత రేటు 16.2 శాతానికి చేరగా, మహిళా యువత నిరుద్యోగిత (20.7శాతం) పురుష యువత నిరుద్యోగిత (14.6 శాతం) కంటే గణనీయంగా అధికంగా ఉంది. 2023లో గ్రాడ్యుయేషన్ పూర్తయిన ఏడాదిలోపే శాశ్వత, జీతం గల ఉద్యోగం సంపాదించిన పురుష గ్రాడ్యుయేట్లు 7 శాతం కంటే తక్కువే ఉండటం, డిగ్రీ ఇకపై మధ్యతరగతిలోకి ప్రవేశానికి హామీ ఇవ్వడం లేదని స్పష్టం చేస్తోంది.

కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు స్పష్టంగానే ఉన్నాయి -పారిశ్రామిక సామర్థ్యంలో ప్రభుత్వ పెట్టుబడి, దేశీయ రక్షణకంటే ఎగుమతి పనితీరుతో క్రమశిక్షణతో కూడిన పరిశ్రమకు మద్దతు, ఉద్యోగాలు కల్పించే మధ్యస్థాయి కంపెనీలను ముఖ్యంగా ప్రభావితం చేస్తున్న ఎంపిక చేసుకుని లక్ష్యంగా చేసుకుంటున్నట్టు కనిపించే నియంత్రణ, అమలు తీవ్రతను తగ్గించడం. వియత్నాం వంటి దేశాలు నిరూపించినట్టుగా, ఈ మార్గం అవసరమైన స్థాయిలో యువతకు ఉద్యోగాలు అందించే మెరుగైన అవకాశాన్ని కలిగి ఉంది. ఇప్పటికే 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న 36.7 కోట్ల మంది భారత్‌లో ఉన్నారు, ఈ యువతను ఉత్పాదకంగా ఉపాధిలో నియమించకపోతే, వారు సామాజిక, ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉంది. ప్రతి నెలా దాదాపు 10 లక్షల మంది యువత శ్రామిక శక్తిలో చేరుతుండగా, భారత జనాభా డివిడెండ్ దీర్ఘకాలిక ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉంది. వ్యవసాయం నుంచి నేరుగా అధిక-నైపుణ్యం అవసరమైన సేవా రంగాలకు దూకేసిన భారత ఆర్థిక వ్యవస్థ, శ్రమ-ఆధారిత తయారీ దశను దాటవేసింది - ఇది సంపదను సృష్టిస్తుందేమో కానీ, సగటు గ్రాడ్యుయేట్‌ను వెనుకబడేలా చేస్తోంది.

ఉచిత కోచింగ్ ప్రకటన మంచి ఉద్దేశమే కావొచ్చు. కాని అసలైన సవాలు, పరీక్షలో ఉత్తీర్ణులైన తర్వాత, డిగ్రీ చేతిలో ఉన్న తర్వాత కూడా నాణ్యమైన ఉద్యోగాల కొరత తప్పదు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ధృవీకరణలు పొందిన యువతలో సగంమందికి కూడా ఉద్యోగం కల్పించలేకపోయింది. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం భారీ బడ్జెట్ కేటాయింపుల ఉన్నప్పటికీ దాదాపు శాశ్వత ఉద్యోగాలేమీ కల్పించలేదు. ఇలాంటి పథకాల వైఫల్యం, సమస్య మూలాన్ని నిర్మాణాత్మక ఆర్థిక సంస్కరణల లేమిని పరిష్కరించకుండా, ఉపరితల పరిష్కారాలతో సరిపెట్టుకునే ధోరణిని బహిర్గతం చేస్తుంది. పరీక్షా సంస్కరణలు, ఉచిత కోచింగ్ వంటివి రాజకీయంగా ఆకర్షణీయంగా కనిపించొచ్చు, కానీ అవి యువత అసలైన ఆగ్రహానికి మూలకారణం కాదు. ఉద్యోగాల కొరతే అసలైన సమస్య. తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, కార్పొరేట్ పెట్టుబడులను ప్రోత్సహించడం, ఎగుమతి ఆధారిత పారిశ్రామిక విధానాన్ని అనుసరించడం వంటి దీర్ఘకాలిక నిర్మాణాత్మక సంస్కరణలు లేకుండా, భారత యువత సంక్షోభానికి శాశ్వత పరిష్కారం లభించదు. పరీక్షా వ్యవస్థను సంస్కరించడం మంచిదే, కానీ ఆ తర్వాత ఉద్యోగం లేకపోతే, ఆ సంస్కరణ కూడా అసంపూర్ణంగానే మిగిలిపోక తప్పదు!

---

**పనికొచ్చే పలుకు**



## జీవనశైలిని ఇలా మార్చుకోండి

సూర్యోదయానికి ముందే నిద్రలేవడం, పచ్చని గడ్డిపై నడవడం, రోజూ 10 వేల అడుగులు వేస్తూ ఎక్కువ సమయం ప్రకృతిలో గడపడం, కుటుంబ సభ్యులు, స్నేహితులకు సమయాన్ని కేటాయించగలగడం వంటివి జీవనశైలిలో చేర్చుకోండి. జీవించడం అంటే అలసిపోయేలా నిరంతరం శ్రమించడం కాదు. మనకు సరికొత్త ఉత్సాహాన్ని, శక్తినిచ్చే వాతావరణాన్ని సృష్టించుకోవడం. ఆధునిక జీవితంలో మనం విజయాన్ని కేవలం పని గంటలతో, సాధించిన లక్ష్యాలతో మాత్రమే కొలుస్తుంటాం. తెల్లవారుజాము వరకూ మేల్కొని పనిచేయడం, వారాంతాల్లోనూ ల్యాప్‌టాప్ ముందు కూర్చోవడం, ప్రకృతితో సంబంధం లేకుండా నాలుగు గోడల మధ్యే గడిపేయడం.. ఇలాంటి జీవనశైలి మనల్ని విజయవంతం చేస్తుందని అనుకుంటాం. కానీ వాస్తవానికి ఇది మెల్లమెల్లగా మన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కబళిస్తుంది. అలసట, ఏకాగ్రత లోపం, నిద్రలేమి, సంబంధాల్లో దూరం -ఇవన్నీ తప్పుడు జీవనశైలి తెచ్చిపెట్టే దుష్ఫలితాలు.

ప్రఖ్యాత అమెరికన్ వాస్తుశిల్పి ఫ్రాంక్ లాయిడ్ రైట్ ఒక అందమైన మాట చెప్పారు. Study nature, love nature, stay close to nature. It will never fail you. అంటే, ప్రకృతిని అధ్యయనం చేయండి, ప్రేమించండి, దానికి దగ్గరగా ఉండండి. అది మిమ్మల్ని ఎప్పటికీ నిరాశపరచదు. ఈ మాటల్లో ఒక లోతైన సత్యం దాగివుంది. మనం ఎంత ఆధునికంగా, సాంకేతికంగా ముందుకెళ్లినా, మన శరీరం ఇప్పటికీ ప్రకృతి లయలతోనే జతకట్టి ఉంది. సూర్యోదయ కాంతి మన శరీర గడియారాన్ని (సర్కేడియన్ రిథమ్‌ను) సరిచేస్తుంది. పచ్చదనం మన కళ్లకు, మనసుకు విశ్రాంతినిస్తుంది, నడక మన కండరాలను, గుండెను బలోపేతం చేస్తుంది. శాస్త్రీయంగా చూసినా, ఉదయం సూర్యరశ్మిలో నడవడం వల్ల విటమిన్ డి ఉత్పత్తి పెరగడంతోపాటు, మెలటోనిన్ హార్మోన్ సక్రమంగా విడుదలై మంచి నిద్ర లభిస్తుంది. పచ్చని ప్రదేశాల్లో గడపడంవల్ల ఒత్తిడి హార్మోన్ కార్టిజాల్ స్థాయి తగ్గుతుందని, రక్తపోటు నియంత్రణలో ఉంటుందని పరిశోధనలు నిరూపించాయి. రోజుకు 10 వేల అడుగులు నడవడం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాదు, మానసిక స్థితిని కూడా సానుకూలంగా మారుస్తుంది. ఇక కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడిపే సమయం, మనలో ఆత్మీయత, భద్రతా భావనను పెంచి డిప్రెషన్‌వంటి సమస్యలను దూరం చేస్తుంది.

ఈ జీవనశైలి మార్పులను మన దైనందిన జీవితంలో ఎలా చేర్చుకోవచ్చో ఆలోచిద్దాం. మొదటిది, అలారం సమయాన్ని 30 నిమిషాలు ముందుకు జరిపి, ఆ సమయాన్ని ప్రశాంతంగా సూర్యోదయాన్ని ఆస్వాదించడానికి కేటాయించండి. రెండోది, వారానికి కనీసం రెండుసార్లు పార్కుకో, తోటకో వెళ్లి చెప్పులు లేకుండా పచ్చిక మీద నడవండి. దీన్నే 'గ్రౌండింగ్' అంటారు. ఇది శరీరంలో ఒత్తిడిని తగ్గించే సహజ పద్ధతి. మూడోది, రోజువారీ నడకను ఒక అలవాటుగా మార్చుకోండి. మెట్లు ఎక్కడం, కారుకు బదులు నడవడం వంటి చిన్న మార్పులతో మొదలుపెట్టవచ్చు. నాలుగోది, వారంలో కనీసం ఒక భోజనాన్ని ఫోన్‌లు పక్కనపెట్టి, కుటుంబంతో కలిసి తినండి. ఈ చిన్న అలవాటు సంబంధాలను గణనీయంగా బలపరుస్తుంది. గుర్తుంచుకోండి -జీవితం అంటే ఎవరు ఎక్కువ గంటలు పనిచేశారో పోటీ పడటం కాదు. ప్రకృతికి దగ్గరగా జీవిస్తూ, ప్రియమైనవారితో సమయం గడుపుతూ, మీ శరీరానికి, మనసుకు కావాల్సిన విశ్రాంతిని ఇవ్వడమే నిజమైన జీవన కళ. ఈ చిన్న చిన్న మార్పులే, దీర్ఘకాలంలో మీకు ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితాన్ని అందిస్తాయి.

---

# వర్షాభావంపై సర్కారు యుద్ధం!



ఈ ఏడాది వర్షాభావంతో ఏపీ పెద్ద సవాలు ఎదుర్కొంటోంది. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో ఏకంగా 51 శాతం వర్షం తక్కువగా కురిసింది. దేశం మొత్తంమీద చూస్తే జూన్ 1 నుంచి ఆగస్టు 25 వరకు వర్షపాతం 13 శాతం తక్కువగా ఉంటే, ఏపీలో మాత్రం పరిస్థితి దారుణంగా ఉంది. రాష్ట్రంలోని మొత్తం 28 జిల్లాల్లోనూ వర్షం తక్కువగానే కురిసింది. అందులో మూడు జిల్లాల్లో అయితే మరీ ఎక్కువ లోటు నమోదైంది. వాస్తవానికి, జూన్‌లో మామూలుగా 79.24 మిల్లీమీటర్ల వర్షం రావాల్సి ఉండగా, కేవలం 29.17 మిల్లీమీటర్లే వచ్చింది. అంటే 63 శాతం తక్కువ. రాష్ట్ర జనాభాలో 62 శాతానికి సేద్యమే ఆధారం. కాబట్టి, రైతులను, పల్లె ప్రజల జీవనోపాధిని కాపాడటమే ప్రభుత్వానికి ఇప్పుడు అతిపెద్ద ప్రాధాన్యతగా మారింది. సమస్యను ముందుగానే పసిగట్టిన ప్రభుత్వం, ఫిబ్రవరిలోనే.. అంటే రెయినీ సీజన్‌కు ముందే వాతావరణ శాఖ, పరిశోధనా సంస్థలతో కలిసి ప్రణాళికలు మొదలుపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 8,489 రైతు సేవా కేంద్రాలను పరిశీలించి, ఏ ప్రాంతంలో ఎంత ప్రమాదముందో ముందే గుర్తించారు. వీటిలో 1,357 కేంద్రాలను ఎక్కువ ప్రమాదమున్న ప్రాంతాలుగా, 2,077 కేంద్రాలను మధ్యస్థ ప్రాంతాలుగా వర్గీకరించారు. వర్షాలపైనే ఎక్కువగా ఆధారపడే రాయలసీమ, పాత ప్రకాశం-నెల్లూరు ప్రాంతాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని ముందే అంచనా వేశారు. ఎక్కడ ఎంత నీరుందో చూసి, దానికి తగినట్టుగా ప్రభుత్వం నాలుగు రకాల చర్యలు తీసుకుంది. ఇదే ఈ మొత్తం ప్రణాళికలో అత్యంత కీలక భాగం. నీటిపారుదల సౌకర్యమున్న ప్రాంతాల్లో పంటలు వేసే సమయాన్ని ముందుకు జరిపి, నీటిని పొదుపుగా వాడేలా చూశారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో మాత్రం, నీరు ఎక్కువగా అవసరమయ్యే వరి పంట బదులు, తక్కువ నీటితో పండే పంటలు వేయమని రైతులను ప్రోత్సహించారు. దీంతోపాటు, ప్రకృతి వ్యవసాయం, వర్షాలు రాకముందే పొడి నేలలో విత్తనాలు వేయడం, విత్తనాలకు ప్రత్యేక పూత పూయడం వంటి కొత్త పద్ధతులను విస్తృతంగా అమలు చేశారు. ఇప్పటివరకు ఇలాంటి పద్ధతులను 18.20 లక్షల ఎకరాల్లో అమలు చేశారు. వ్యవసాయ కుంటలు తవ్వడం, నేలలో తేమను కాపాడుకోవడం, రకరకాల పంటలు వేయడం, పశువులకు మేత దొరికేలా చూడటం వంటి చర్యలను కూడా ప్రభుత్వం ప్రోత్సహించింది. పంటల బీమా విషయంలో అయితే గత ఏడాదితో పోలిస్తే భారీ పురోగతి కనిపించింది. గత ఖరీఫ్‌లో 7.83 లక్షల హెక్టార్లకు మాత్రమే బీమా ఉంటే, ఈసారి అది 16.39 లక్షల హెక్టార్లకు రెట్టింపైంది. దీంతో పంటల బీమాలో ఏపీ దేశంలోనే ఐదో స్థానంలో నిలిచింది. రైతులకు మరింత సమయం ఇవ్వడానికి, ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో నమోదు చేసుకునే గడువును ఆగస్టు 31 వరకు పొడిగించారు.


'రైతన్న మీకోసం' పేరుతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం కింద, వేర్వేరు శాఖలకు చెందిన అధికారుల బృందాలు 18,513 గ్రామాల్లో ప్రతి పొలాన్నీ విడివిడిగా పరిశీలిస్తున్నాయి. మొత్తం 2.74 కోట్ల పొలాలను సర్వే చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 96.91 శాతం పూర్తయింది. ఇది ఎంత వేగంగా, ఎంత విస్తృతంగా ఈ సర్వే జరుగుతోందో చూపిస్తుంది. "చాలా పంటలు ఇప్పటికీ మామూలు స్థితిలోనే ఉన్నాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మాత్రమే పంటలపై ఒత్తిడి కనిపిస్తోంది" అని వ్యవసాయ అధికార్లు చెబుతున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 20.35 లక్షల హెక్టార్లలో పంటలు వేయగా, గత ఏడాది ఇదే సమయానికి 25.63 లక్షల హెక్టార్లలో వేశారు. ఇది వ్యవసాయ పనులు తగ్గిపోయాయనడానికి సంకేతం కాదని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పప్పుధాన్యాలు, ఇతర పంటలవైపు ప్రణాళికాబద్ధంగా మళ్లడమేనని అధికార్లు అంటున్నారు. వరి సాగు 11.7 లక్షల హెక్టార్లనుంచి 10.3 లక్షల హెక్టార్లకు తగ్గగా, పప్పుధాన్యాల సాగు 2.1 లక్షల నుంచి 2.6 లక్షల హెక్టార్లకు పెరగడం ఇందుకు నిదర్శనం.

ఈ మొత్తం సన్నద్ధత వెనుక, ముఖ్యమంత్రి చంద్రబాబు ముందునుంచే వేసిన బలమైన పునాది ఉంది. నీటి భద్రత లేకుండా ఏ రంగమూ అభివృద్ధి చెందదని నమ్మే ఆయన, ఏప్రిల్ 6నే అనంతపురం జిల్లా యాడికిలో 'జలధార' పేరట వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రారంభించారు. చెరువుల్లో పూడిక తీయడం, కాలువలు బాగుచేయడం, భూగర్భ జలాలను పెంచడం, నీటిని పొదుపుగా వాడటం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. "ప్రతి ఎకరాకూ నీరు, ప్రతి రైతుకూ భరోసా" అన్నదే దీని నినాదం. ఇందులో 60 వేల మంది నీటి వినియోగదారుల సంఘాల సభ్యులు పాల్గొంటున్నారు. భూగర్భ జలాలు తగ్గిపోయిన 5,697 గ్రామాలను ముందే గుర్తించి, చెరువులు నింపడం ద్వారా నీటి మట్టాన్ని కనీసం 1.5 మీటర్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అన్నమయ్య జిల్లాలో విజయవంతమైన 'జలధార' ప్రాజెక్టు స్ఫూర్తితో, వాగులు, వంకలు, నీటి వనరులను అనుసంధానించి నీటిని ఎక్కువగా నిల్వ చేసుకోవాలని, వరదలను నివారించాలని కూడా ఆయన సూచించారు. ఉపగ్రహ చిత్రాలు, హైడ్రలాజికల్ మ్యాపింగ్‌ను ఉపయోగించి శాస్త్రీయంగా ప్రణాళికలు వేయాలని, నీటి వినియోగదారుల సంఘాలు 'వాటర్ బడ్జెట్‌లు', 'వాటర్ ఆడిట్‌లు' తయారు చేయాలని కూడా ఆదేశించారు.

రాయలసీమలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండటంతో చిరుధాన్యాలు, పప్పుధాన్యాల వంటి తక్కువ నీటితో పండే పంటలవైపు మళ్లాలని కోరారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, తాగునీరు, విద్యుత్‌వంటి అత్యవసర సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా అందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర, జాతీయ విపత్తు నిధుల నుంచి ఇప్పటికే నిధులు విడుదల చేయడం, ప్రభుత్వం విపత్తు నిర్వహణపై ఎంత సీరియస్‌గా ఉందో చూపిస్తుంది.

దీర్ఘకాలిక పరిష్కారంగా, 2026 నుంచి 2028 మధ్య 36 నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం కాలపరిమితితో కూడిన ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో 25 పెండింగ్ ప్రాజెక్టులు, కొత్తగా గుర్తించిన 11 ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రధాన డెల్టా ప్రాంతాలకు నీటి విడుదల తేదీలను ముందే ప్రకటించే 'వాటర్ క్యాలెండర్'ను తొలిసారిగా ప్రవేశపెట్టాలని కూడా నిర్ణయించారు. రాయలసీమ కరువు ప్రాంతాలకు హంద్రీ-నీవా సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులు, ఉత్తరాంధ్రకు పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి సరఫరా కీలకంగా మారనున్నాయి. మైక్రో ఇరిగేషన్ (బిందు సేద్యం) రంగంలో ఇప్పటికే దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామని, రూ.1,031 కోట్లు ఖర్చు చేసి బిందు సేద్యం విస్తరించడం వల్లే రాయలసీమ ఉద్యాన వన రంగానికి కేంద్రంగా మారిందని, ఈ రంగంలోనూ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నామని సీఎం నాయుడు గతంలో పేర్కొన్నారు. మొత్తంమీద చూస్తే, వర్షాలు లేకపోయినా, ముందుచూపుతో కూడిన ప్రణాళిక, శాస్త్రీయ పద్ధతులు, సకాలంలో తీసుకున్న నిర్ణయాల ద్వారా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. ఇలాంటి పటిష్టమైన స్పందన, భవిష్యత్తులో ఇలాంటి వర్షాభావ పరిస్థితులు మళ్లీ వచ్చినా, రైతులకు, రాష్ట్ర ఆహార భద్రతకు రక్షణ కవచంలా పనిచేస్తుంది. ■

---



క్రమశిక్షణ గల వ్యక్తి పని చేయడానికి సరైన మూడ్ కోసం వేచి చూడడు. అలసటగా ఉన్నా, అయోమయంలో ఉన్నా, విసుగు అనిపించినా ముందుకు సాగుతాడు. ప్రేరణ అనేది ప్రయాణాన్ని ప్రారంభించడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. కానీ ఆ ఉత్సాహం తగ్గిన తర్వాత కూడా మిమ్మల్ని గమ్యం వైపు నడిపించేది కేవలం క్రమశిక్షణ మాత్రమే. ప్రేరణ వెలుగులా వచ్చిపోతుంది, కానీ క్రమశిక్షణ మాత్రం నిశ్చలంగా వెలుగుతూనే ఉంటుంది. మూడ్ కోసం ఎదురుచూసేవారు గమ్యానికి దూరంగానే ఉండిపోతారు, అలసటనూ దాటి అడుగేసేవారే చివరికి విజయాన్ని అందుకుంటారు.

-మహాదేవ

---

**వింతల్లో వింతలు**

## కోతి చెవి సాహస విన్యాసం



చైనాలోని గుయిజౌ ప్రావిన్స్‌లో ఉన్న 'హౌర్' (కోతి చెవి) సింక్‌హోల్ ప్రకృతి వైపరీత్యం కాదు, ఒక అద్భుత ప్రకృతి సృష్టి - 300 మీటర్ల వ్యాసంతో, 280 మీటర్ల లోతుతో ఏర్పడిన ఈ కార్స్ట్ సింక్‌హోల్ చైనాలోని అత్యంత మనోహరమైన ప్రకృతి వింతల్లో ఒకటి. దీన్ని మరింత ప్రత్యేకంగా అనుభవించేందుకు, ఫిబ్రవరి 6, 2026న ఇక్కడ ఒక వినూత్నమైన జిప్‌లైన్ వ్యవస్థను ప్రారంభించారు. సాధారణ జిప్‌లైన్‌లకు భిన్నంగా, ఇది సొరంగం ఆకారంలో ఉండే ప్రత్యేక ట్రాక్‌పై నడుస్తుంది, సందర్శకులు పూర్తి భద్రతా పరికరాలు ధరించి, హ్యాండిల్స్ పట్టుకుని 280 మీటర్ల ఎత్తు నుంచి గాలిలో దూసుకెళ్తారు. ఇది ఆన్‌లైన్‌లో వైరల్ అయిన మొబైల్ గేమ్ 'టెంపుల్ రన్'ను నిజ జీవితంలో అనుభవించినట్టుగా ఉంటుందని నెటిజన్లు పోల్చుతున్నారు. కొండల మధ్య దూసుకెళ్తూ, కింద పచ్చని అడవులు, దాగివున్న జలపాతాలను చూస్తూ సాగే ఈ ప్రయాణం, "రిస్క్ లేని సాహసం"గా పేరొందింది - సురక్షితమే అయినా, అడ్రినలిన్‌ను పెంచేలా ఉంటుంది. టిక్‌టాక్‌లో 200 కోట్లకు పైగా వీక్షణలు సాధించిన ఈ వీడియోలు, సాహసప్రియులను చైనా వైపు ఆకర్షిస్తున్నాయి.

# బృహద్ధమని చీలితే చిక్కే

పదిహేనేళ్ల పిల్లాడు. ప్రమాదవశాత్తు ఇంటి ఐదో అంతస్తు నుంచి కింద పడిపోయాడు. తీవ్ర రక్తస్రావమైన స్థితిలో అతడిని ఆసుపత్రికి తీసుకొచ్చారు. శరీరంలో పలు చోట్ల గాయాలైనట్టు పరీక్షల్లో తేలింది. మెదడు, క్లోమం, కాలేయం దెబ్బతినటంతో పాటు తొడ ఎముక కూడా విరిగింది. వీటన్నింటికన్నా అత్యంత ప్రమాదకరమైంది గుండె నుంచి శరీరంలోకి రక్తాన్ని చేరవేసే బృహద్ధమని (అయోర్టా) చీలటం. దీన్ని సరిచేస్తే గానీ ఇతర చికిత్సలు సాధ్యం కావు. ఒకప్పుడు దీనికి మరమ్మతు చేయటమే కష్టంగా ఉండేది. అధునాతన చికిత్సల రాకతో పరిస్థితి మారింది. ముఖ్యంగా థొరాసిక్ ఎండోవ్యాస్కులర్ అయోర్టిక్ రిపేర్ (టీఈవీఏఆర్) పుణ్యమాని ఎంతోమంది బతికి బయటపడుతున్నారు. ఛాతీ తెరవాల్సిన పనిలేకుండా.. రక్తనాళం ద్వారా గొట్టాన్ని పంపించి, లోపలి నుంచే స్టెంటు అమర్చటం దీని ప్రత్యేకత. పెద్దవారికి ఉద్దేశించిన ఇది ఇప్పుడు కాస్త పెద్ద పిల్లలకూ వరదాయినిగా నిలుస్తోంది. చీలికను సత్వరం మూసేసి, ప్రాణాలను కాపాడటానికి తోడ్పడుతోంది. బృహద్ధమని ప్రత్యేకతే వేరు. పేరుకు తగ్గట్టుగానే శరీరంలో అతిపెద్ద ధమని ఇదే. గుండె వద్ద మొదలై ఛాతీ, కడుపు కుహరాల ద్వారా కటి భాగం వరకూ విస్తరిస్తుంది. గుండె నుంచి వచ్చే ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని అధిక పీడనంతో అన్ని అవయవాలకు చేరేలా చూస్తుంది. ఇలా రక్త ప్రసరణ సజావుగా సాగేలా, గుండె కొట్టుకుంటున్నప్పుడు రక్తపోటు స్థిరంగా ఉండేలా చూడటంలో పెద్దన్న పాత్ర పోషిస్తుంది. ఇంతటి కీలకమైంది కాబట్టే దీనికి చిన్న చీలిక ఏర్పడినా పెద్ద ప్రమాదమే ముంచుకొస్తుంది. ఇక తీవ్ర గాయాలతో బృహద్ధమని గోడ చీలితే? ఛాతీలోకి పెద్దఎత్తున రక్తం లీక్ అవుతుంది. పూర్తిగా చిట్లిపోతే నిమిషాల్లోనే ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. అదృష్టవశాత్తూ, కొందరిలో చుట్టుపక్కల కణజాలాలు తాత్కాలికంగా రక్తస్రావాన్ని అడ్డుకొని నకిలీ బుడగను (సూడోఅన్యూరిజమ్) సృష్టించటం ద్వారా రక్షణగా నిలుస్తుంటాయి. అయినా కూడా చీలిక నిర్ధారణకు, చికిత్సకు అంత సమయమేమీ ఉండదు. అందుకే సత్వరం స్పందించటం చాలా కీలకం.

**వంపు మొదట్లోనే..**

బృహద్ధమని పైబాగం చేతి కర్ర మాదిరిగా వంపు తిరిగి, కిందికి సాగుతుంది. గుండె కొట్టుకున్న ప్రతిసారీ ఛాతీ కుహరంలో స్వేచ్ఛగా కదులుతుంటుంది. కానీ కిందికి సాగిన భాగం స్థిరంగా ఉంటుంది. పైభాగం, కిందిభాగం కలిసే చోటును అయోర్టిక్ ఇస్త్‌మస్ అంటారు. చీలిపోయే ముప్పు ఇక్కడే ఎక్కువ. ఎందుకంటే ప్రమాదాలకు గురైనప్పుడు.. ఉదాహరణకు భవనం నుంచి కింద పడ్డప్పుడు పైభాగం కదులుతూనే ఉండగా.. కింది భాగం స్థిరంగా ఉంటూ దాని కదలికను నిరోధిస్తుంటుంది. దీంతో అయోర్టిక్ ఇస్త్‌మస్ కోణం అస్తవ్యస్తమై, తీవ్రమైన ఒత్తిడి ఏర్పడి.. చీలటానికి దారితీస్తుంది.

చీలికను బట్టి తీవ్రత

బృహద్ధమని గోడ మూడు పొరలుగా ఉంటుంది. గాయం మూలంగా కొందరికి లోపలి పైపొర మాత్రమే చీలితే మరికొందరికి లోలోపలి పొరలూ చిట్లిపోవచ్చు. ఇవి దెబ్బతినటాన్ని బట్టి తీవ్రతను నిర్ణయిస్తారు.

**లక్షణాలేంటి?**

తీవ్ర షాక్‌కు గురైన స్థితిలో చాలామందిని ఆసుపత్రికి తీసుకొస్తుంటారు. వీరిలో రక్తపోటు పడిపోవటం, ఛాతీనొప్పి, ఆయాసం వంటివీ ఉంటాయి. అయితే తల, కడుపు, ఊపిరితిత్తుల వంటి భాగాలకు అయిన గాయాల లక్షణాలూ కనిపిస్తుంటాయి. బృహద్ధమనికి బాగా దెబ్బ తగిలినా కొందరు బాగానే ఉండటం విచిత్రం. దీనికి కారణం చీలిక తాత్కాలికంగా పూడుకోవటం. అందువల్ల ఛాతీకి ఏదైనా బలమైన దెబ్బతగిలితే నిశితంగా పరిశీలించటం చాలా ముఖ్యం.

నిర్ధారణ ఇలా..

శరీరాన్ని క్షుణ్నంగా పరిశీలించి, ఆయా గాయలకు అనుగుణంగా ప్రాథమిక చికిత్స చేయటం ప్రధానం. శ్వాస తీసుకోవటం, రక్త ప్రసరణ కుదుటపడ్డాక సీటీ యాంజియోగ్రామ్ చేయాల్సి ఉంటుంది. ఇది సమస్యను చాలా త్వరగా, కచ్చితంగా గుర్తించటానికి తోడ్పడుతుంది. అందుకే దీన్ని ప్రామాణికంగా పరిగణిస్తారు. ఇందులో బృహద్ధమనిలో ఎక్కడ గాయమైంది? ఉబ్బు ఏమైనా తలెత్తిందా? రక్తం గూడు కట్టిందా? ఛాతీలో ఇతరత్రా గాయాలేవైనా ఉన్నాయా? అనేవి స్పష్టంగా బయటపడతాయి. ధమనికి తగిన సైజు స్టెంటును ఎంచుకోవటానికీ వీలవుతుంది.

**టీఈవీఏఆర్ మేలు**

ఒకప్పుడు బృహద్ధమని చీలినా, గోడ పలుచబడి ఉబ్బినా ఛాతీని తెరచి శస్త్రచికిత్స చేయటమే ఏకైక మార్గం. దెబ్బతిన్న భాగాన్ని తొలగించి, దాని స్థానంలో కృత్రిమ రక్తనాళాన్ని (గ్రాఫ్ట్) అతికించేవారు. దీంతో ప్రాణాపాయం తప్పినప్పటికీ ఆ తర్వాత ఎన్నో సమస్యలు వెంటాడేవి. థొరాసిక్ ఎండోవాస్కులర్ అయోర్టిక్ రిపేర్ (టీఈబీఏఆర్) రాకతో ఇలాంటి ఇబ్బందులు చాలావరకూ తగ్గిపోవటం గమనార్హం. ఇందులో తొడ వద్ద చిన్న కోత పెట్టి, అక్కడి ధమని ద్వారా లోపలికి స్టెంటు గ్రాఫ్ట్‌తో పాటు సన్నటి గొట్టాన్ని పంపిస్తారు. కవర్‌తో కూడుకొని ఉండే ఈ స్టెంటులో లోహపు చట్రం దిగువన ఈపీటీఎఫ్ఈ లేదా డాక్రన్ వంటి కృత్రిమ వస్త్రంతో చేసిన (ఫ్యాబ్రిక్) పొర ఉంటుంది. ఫ్లోరోస్కోపీ ఎక్స్‌రే ద్వారా చూస్తూ.. బృహద్ధమని చీలిక వద్దకు చేరుకొని ముందు లోహపు చట్రాన్ని విప్పారుస్తారు. అదే సమయంలో ఫ్యాబ్రిక్ పొర ధమని లోపలి నుంచి చీలికను మూసేస్తుంది. ఆ వెంటనే దాని గుండా రక్త ప్రసరణ మొదలవుతుంది. రక్తం తిరిగి గుండెలోకి వెనక్కి మళ్లటం ఆగుతుంది. రక్తస్రావం పెద్దగా ఉండదు కాబట్టి త్వరగా కోలుకుంటారు.

**చిన్నపిల్లల్లో సవాలే**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న థొరాసిక్ స్టెంట్ గ్రాఫ్టులు పెద్దవారి కోసం రూపొందించినవే. చిన్నపిల్లల్లో తొడ వద్ద ఉండే ధమని సైజు చిన్నగా ఉంటుంది. అందువల్ల గొట్టం ద్వారా చీలిక వరకు చేరవేయటం సాధ్యం కాదు. ఇలాంటి పరిస్థితుల్లో ఛాతీ తెరచి శస్త్రచికిత్స చేయటం తప్ప మరో మార్గం లేదు. కాస్త పెద్ద పిల్లలకు.. అంటే 14, 15 ఏళ్లు దాటి, ధమని సైజు పెద్దగా ఉన్నవారికీ వీటిని ఉపయోగించుకోవచ్చు. అయితే స్టెంటును ఎంపిక చేయటం దగ్గరి నుంచి ముందుముందు ధమని సైజు పెరగటం, శాఖలు దెబ్బతినకుండా చూసుకోవటం వంటివి జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది.

నివారణే ప్రధానం

**గాయాలు, ప్రమాదాల సమస్యలతో బాధపడటం కన్నా వీటిని నివారించుకోవటమే ఉత్తమం.**

వాహనాల్లో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించాలి. ఇంటి బాల్కనీకి రెయిలింగ్ ఏర్పాటు చేయాలి. కిటికీలకు రక్షణ కవచాలు బిగించాలి. పిల్లల మీద ఎప్పుడూ ఓ కన్నేసి ఉంచాలి.

ప్రమాదాలు, గాయాలకు గురైనప్పుడు ఎలా స్పందించాలో కూడా తెలుసుకోవాలి.

అంబులెన్స్‌లో త్వరగా తరలించటం, అన్ని సదుపాయాలు గల ఆసుపత్రిలో చేర్చటమూ ముఖ్యమే. ఎంత త్వరగా స్పందిస్తే అంత త్వరగా ప్రాణాపాయాన్ని తప్పించే అవకాశ ముంటుంది.

**చికిత్స అనంతరం**

స్టెంటు అమర్చటంతోనే పూర్తిగా కోలుకున్నట్టు కాదు. అది సరైన స్థానంలో ఉందో లేదో, దెబ్బతిన్న బృహద్ధమని సరిగా నయమవుతుందో లేదో తెలుసుకోవటానికి సీటీ లేదా ఎంఆర్ఐ పరీక్ష చేయాల్సి ఉంటుంది. పిల్లల్లో బృహద్ధమని నిరంతరం పెరుగుతూ వస్తుంది కాబట్టి పర్యవేక్షణ అవసరం. సీటీ/ఎంఆర్ఐ పరీక్షలో అంతా బాగున్నట్టు తేలితే అందరిలా హాయిగా బడికి వెళ్లొచ్చు, ఆడుకోవచ్చు. వీరిలో భావోద్వేగాలను అదుపులో ఉంచుకునేలా, ఆత్మవిశ్వాసాన్ని పాదుకొల్పేలా చూడటమూ ముఖ్యమే.

# మూడ్ మార్చేసే ఇంటీరియర్ డిజైనింగ్!

**మనం వాడే వస్తువైనా, ధరించే దుస్తులైనా.. మన శరీరానికి సౌకర్యాన్నిచ్చినప్పుడే.. మనసూ ప్రశాంతంగా ఉంటుంది. ఇంటీరియర్‌కూ ఈ సూత్రం వర్తిస్తుందంటున్నారు నిపుణులు. నచ్చిన ఫర్నిచర్‌తో ఇంటిని అలంకరించుకుంటే.. సౌకర్యవంతంగానే కాదు.. మనసుకూ ఎంత సంతోషంగా ఉంటుందో మాటల్లో చెప్పలేం! పైగా ఎంత సేపైనా అక్కడే ఉండాలనిపిస్తుంది.**



మనం వాడే వస్తువైనా, ధరించే దుస్తులైనా.. మన శరీరానికి సౌకర్యాన్నిచ్చినప్పుడే.. మనసూ ప్రశాంతంగా ఉంటుంది. ఇంటీరియర్‌కూ ఈ సూత్రం వర్తిస్తుందంటున్నారు నిపుణులు. నచ్చిన ఫర్నిచర్‌తో ఇంటిని అలంకరించుకుంటే.. సౌకర్యవంతంగానే కాదు.. మనసుకూ ఎంత సంతోషంగా ఉంటుందో మాటల్లో చెప్పలేం! పైగా ఎంతసేపైనా అక్కడే ఉండాలనిపిస్తుంది. ఇదే పరోక్షంగా మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేస్తుందట! అందుకే నచ్చినట్లుగా ఇంటిని అలంకరించుకుంటే.. రోజువారీ ఒత్తిళ్లు, ఆందోళనలు దూరమై హ్యాపీగా ఉండచ్చని పలు అధ్యయనాలూ చెబుతున్నాయి. మరి, ఇంటీరియర్ డిజైనింగ్ మానసిక ఆరోగ్యంపై ఎలాంటి సానుకూల ప్రభావం చూపుతుందో తెలుసుకుందాం రండి..





**గదిని బట్టి.. రంగులు!**

ఇంటి అందాన్ని పెంచడంలో, మనసుకు ఆహ్లాదాన్ని అందించడంలో రంగులది కీలక పాత్ర! నచ్చిన రంగుల్ని ఎంచుకుంటే.. అటు సౌకర్యంగా, ఇటు ప్రశాంతంగా అనిపిస్తుంది. ఈ క్రమంలోనే శరీరంలో డోపమైన్ అనే హ్యాపీ హార్మోన్ విడుదలవుతుంది. తద్వారా సంతోషంగా ఉండగలుగుతాం. అయితే మనకు నచ్చిన రంగుల్ని ఎంచుకుంటే సరిపోదు.. గది అవసరాల్నీ పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు నిపుణులు. ఉదాహరణకు.. పడకగదిలో రిలాక్సవుతాం.. కాబట్టి ఇక్కడ మనసుకు ప్రశాంతతను అందించే లేత రంగులు, అందులోనూ ముఖ్యంగా పేస్టల్ షేడ్స్‌ని ఎంచుకోవడం మంచిదంటున్నారు. అదే కిచెన్‌లో పనిచేసే సమయంలో ఉత్సాహంగా, చురుగ్గా ఉంటేనే పనులు సమయానికి పూర్తవుతాయి. కాబట్టి ఈ గదికి ఎరుపు, ఆరెంజ్.. వంటి రంగులు నప్పుతాయంటున్నారు. ఇలా గది ప్రత్యేకతల్ని బట్టి రంగుల్ని ఎంచుకుంటే.. అది ఆటోమేటిక్‌గా మనసుపై సానుకూల ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు.

**'బయోఫిలిక్ డిజైన్' తెలుసా?**

ఇంటి అలంకరణ విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కో అభిరుచి ఉంటుంది. కొందరు తమ ఇల్లు మోడ్రన్‌గా ఉండాలని కోరుకుంటే.. మరికొందరు వింటేజ్ థీమ్‌ని ఎంచుకుంటుంటారు. అయితే ఎవరి ఇష్టాయిష్టాలెలా ఉన్నా.. బయోఫిలిక్ ఇంటీరియర్ ట్రెండ్ మాత్రం ఇటు ఆరోగ్యాన్నిస్తూనే, అటు మానసిక ప్రశాంతతను, సౌకర్యాన్ని సొంతం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు కారణం.. ఈ డిజైనింగ్ కోసం వాడే అలంకరణ వస్తువులన్నీ పర్యావరణహితమైన ఉత్పత్తులతో తయారుచేయడమే! చెక్క, మట్టి, ఓక్ చెట్టు బెరడు, రాటెన్ (ఇదో రకమైన కలప), ఉన్ని.. వంటి ప్రకృతి అందించే మెటీరియల్స్‌ని ఈ వస్తువుల తయారీలో ఉపయోగిస్తుంటారు డిజైనర్లు. బయోఫిలిక్ ఇంటీరియర్‌లో భాగంగా ఇలా గృహాలంకరణ వస్తువులే కాదు.. ఇంట్లోనే గోడకు లేదంటే ఓ మూలన చిన్నపాటి గార్డెన్‌లా పచ్చదనాన్ని ఏర్పాటుచేసుకోవడం, ప్రకృతి రమణీయతతో కూడిన ఆర్ట్‌వర్క్‌కి ఇంట్లో చోటివ్వడం.. వంటివీ దీని కిందకే వస్తాయి. ఈ తరహా ఫర్నిచర్/గృహాలంకరణ వస్తువులతో మానసిక ఒత్తిళ్లు, ఆందోళనలు తగ్గి.. ప్రశాంతత చేకూరుతుందని పలు అధ్యయనాల్లోనూ తేలింది.

**వెలుతురు..ఓఎక్కడెలా?**

వెలుతురు కూడా మన మనసును ప్రభావితం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందులోనూ సహజసిద్ధమైన లైటింగ్ కీలక పాత్ర పోషిస్తుందట! అయితే చాలామంది వేడిగా ఉందని, దుమ్ము వస్తుందని.. పగటి పూటే తలుపులు, కిటికీలు మూసేసి.. వెలుతురు కోసం లోపలి లైట్లను ఉపయోగిస్తుంటారు. కానీ పగటి పూట వచ్చే న్యాచురల్ లైటింగ్‌ని ఇలా అడ్డుకోకుండా పూర్తిగా ఆస్వాదించినప్పుడే మనసుకు సాంత్వన చేకూరుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే పగటి పూట తలుపులు, కిటికీలు తీసే ఉంచడం మంచిది. అవసరమైతే వాటికి పల్చటి కర్టెన్లు వేలాడదీస్తే.. వేడి, దుమ్ము బెడద లేకుండా ఉంటుంది.. ఇంట్లో వెలుతురు కూడా పడుతుంది. ఇక రాత్రి పూట ఇంట్లో ఉపయోగించే లైటింగ్ కూడా గది అవసరాల్ని బట్టి ఉండాలంటున్నారు నిపుణులు.

లివింగ్ రూమ్‌లో ఎక్కువ సమయం గడుపుతుంటాం కాబట్టి ఈ గదిలో ప్రకాశవంతమైన లైట్లను ఏర్పాటుచేసుకోవాలి. ఇక గోడలపై ఏర్పాటుచేసిన ఫొటో ఫ్రేములు, ఆర్ట్ వర్క్‌పై మినీ స్పాట్ లైట్లను ఏర్పాటుచేసుకుంటే గదికి అందమొస్తుంది.. మనసుకు ఆహ్లాదంగానూ అనిపిస్తుంది.

అదే పడకగదిలో లైటింగ్ ఎంత తక్కువగా ఉంటే మనసుకు అంత ప్రశాంతంగా ఉంటుందంటున్నారు నిపుణులు. పుస్తకాలు చదువుకోవడానికి, వర్క్ చేసుకోవడానికి టేబుల్ ల్యాంప్స్‌ని ఉపయోగించచ్చు.

ఇక డైనింగ్ టేబుల్‌పై షాండ్లియర్/పెండెంట్ లైటింగ్ ఏర్పాటుచేసుకుంటే.. ఆ గదికి ఆ లైటింగ్ సరిపోతుంది. లైట్ల ఫోకస్ ఎక్కువగా లేకుండా ప్రశాంతమైన భావన కలుగుతుంది.

ఇక కిచెన్‌లోనూ లైటింగ్ ప్రకాశవంతంగా ఉండాల్సిందే! అయితే దీంతో పాటు క్యాబినెట్స్, అరల్లో స్పాట్ లైట్లను ఏర్పాటుచేసుకుంటే.. అక్కడి వస్తువులు సులభంగా వాడుకోవడానికి వీలుగా ఉంటుంది.. కంఫర్టబుల్‌గానూ అనిపిస్తుంది. ఇది పరోక్షంగా మానసిక ప్రశాంతతనూ పెంచుతుంది.

**గోడలకు.. 'డోపమైన్' టచ్!**

ఇంటి అలంకరణ అనగానే చాలామంది గోడల పైనే తమ దృష్టి కేంద్రీకరిస్తారు. తమకు నచ్చిన చిత్రాల్ని గోడలకు తగిలించడం లేదంటే చక్కటి వాల్ ఆర్ట్ వేయించుకోవడం, వాల్‌పేపర్‌ని అతికించుకోవడం.. ఇలా ఎవరి స్టైల్ వారిది! అయితే అందులోనూ 'అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ (వాస్తవికతకు సంబంధం లేకుండా గీసే చిత్రకళ)', 'పర్సనలైజ్‌డ్ ఆర్ట్ (వ్యక్తిగత అభిరుచులు, జ్ఞాపకాలతో చిత్రాల్ని రూపొందించడం)'.. వంటివి మనసుకు ఎక్కువ సంతోషాన్ని, ప్రశాంతతను అందిస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే వీటిని 'డోపమైన్ డెకార్'గా నిపుణులు పేర్కొంటున్నారు. కాబట్టి ఇలాంటి అలంకరణ వస్తువులతో గోడలకు హంగులద్దితే ఇటు ఇంటికి అందం తీసుకురావచ్చు.. అటు మనసునూ ప్రశాంతంగా ఉంచుకోవచ్చు అంటున్నారు నిపుణులు.



## భారత్ విజయానికి అడ్డుగోడలా దినుష..

# రెండో టెస్టు డ్రా.. గిల్ సేనదే సిరీస్

- ఫాలో ఆన్ ఆడినా అద్భుత పోరాటంతో రెండో టెస్టును డ్రా చేసుకున్న శ్రీలంక
- అజేయ సెంచరీతో జట్టును ఆదుకున్న యువ కెరటం సోనల్ దినుష
- తొలి ఇన్నింగ్స్‌లో పడిక్కల్, ధ్రువ్ జురెల్ శతకాలతో భారత్ భారీ స్కోరు
- బౌలర్లకు సహకరించని పిచ్‌పై లంక బ్యాటర్ల అద్వితీయ నిలకడ
- ఈ సిరీస్‌లో మూడు సెంచరీలతో దినుష, 16 వికెట్లతో మానవ్ సుతార్ టాప్ పెర్ఫార్మర్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక యువ బ్యాటర్ సోనల్ దినుష అద్భుతమైన ప్రతిఘటనతో భారత్ విజయానికి అడ్డుగోడలా నిలిచాడు. ఓటమి అంచున నిలిచిన జట్టును తన వీరోచిత సెంచరీతో ఆదుకుని, రెండో టెస్టును డ్రాగా ముగించడంలో కీలక పాత్ర పోషించాడు. ఫాలో ఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడిన శ్రీలంక, ఓటమి ఖాయమనుకున్న దశలో దినుష (133 నాటౌట్) అసాధారణ పోరాటపటిమతో భారత్ కు సవాలుగా నిలిచాడు. అతనికి ఇతర బ్యాటర్లు చక్కటి సహకారం అందించడంతో, కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలుపు ఆశలు గల్లంతయ్యాయి. మ్యాచ్ చివరి రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 429 పరుగులు చేసింది. అప్పటికే లంక ఆధిక్యం 216 పరుగులకు చేరింది. ఇవాళ ఆటకు చివరి రోజు కాగా, టీమిండియా గెలిచే అవకాశం లేకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అద్భుతమైన ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను కాపాడుకున్న సోనల్ దినుషను భారత ఆటగాళ్లు, కోచ్ గౌతమ్ గంభీర్ ప్రత్యేకంగా అభినందించారు. **ఫాలో ఆన్‌లో లంక పోరాటం**

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 503 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. దేవదత్ పడిక్కల్ (117), ధ్రువ్ జురెల్ (115) సెంచరీలతో కదం తొక్కగా, యశస్వి జైస్వాల్ (45), శుభ్‌మన్ గిల్ (50), రిషభ్ పంత్ (63) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక 290 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్ల ధాటికి లంక బ్యాటర్లు చేతులెత్తేయగా, సోనల్ దినుష (103), పసిందు సూరియబండార (80) మాత్రమే రాణించారు. దీంతో భారత్‌కు 213 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. భారీ ఆధిక్యంతో శ్రీలంకను ఫాలో ఆన్‌కు ఆహ్వానించిన భారత్‌కు ఆతిథ్య జట్టు ఊహించని షాక్ ఇచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లో లంక బ్యాటర్లు అద్భుతమైన పోరాటాన్ని ప్రదర్శించారు. పసిందు సూరియబండార (92), కమిందు మెండిస్ (55) రాణించగా, సోనల్ దినుష మరోసారి శతకంతో కదంతొక్కాడు. ఈ సిరీస్‌లో అతనికి ఇది మూడో సెంచరీ కావడం విశేషం. దినుషకు కేశర నువంత (46) తోడవడంతో లంక ఓటమి నుంచి గట్టెక్కింది. లంక టెయిలెండర్లు దాదాపు 90 ఓవర్ల పాటు క్రీజులో నిలబడి భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. బ్యాటింగ్‌కు పూర్తిగా అనుకూలించిన పిచ్‌పై భారత బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. భారత బౌలర్లలో ఈ సిరీస్ మొత్తం మీద మానవ్ సుతార్ 16 వికెట్లతో అగ్రస్థానంలో నిలవగా, లంక బౌలర్లలో అసిత్ ఫెర్నాండో 10 వికెట్లు పడగొట్టాడు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది.

# తండ్రుల బాటలోనే.. భారత అండర్-19 జట్టులోకి సెహ్వాగ్, ద్రవిడ్ కుమారులు

- ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఆర్యవీర్ సెహ్వాగ్ ఎంపిక
- అన్వయ్ ద్రవిడ్‌కు భారత అండర్-19 జట్టులో చోటు
- సెప్టెంబర్ 18న తొలి వన్డే
- 3 వన్డేలకు రాజ్‌కోట్ ఆతిథ్యం
- వన్డే కెప్టెన్‌గా లక్ష్య రైచందాని ఎంపిక





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ దిగ్గజాలు విరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్ వారసులు మరోసారి వార్తల్లో నిలిచారు. ఆస్ట్రేలియా అండర్-19తో జరగనున్న సిరీస్‌కు భారత జట్టులో ఆర్యవీర్ సెహ్వాగ్, అన్వయ్ ద్రవిడ్‌కు చోటు దక్కింది. భారత్-ఆస్ట్రేలియా అండర్-19 జట్ల మధ్య మూడు వన్డేలు జరగనున్నాయి. సెప్టెంబర్ 18, 21, 23 తేదీల్లో రాజ్‌కోట్‌లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత నాలుగు రోజుల మ్యాచ్‌లు రెండు ఉంటాయి. సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు రాజ్‌కోట్‌లో తొలి మ్యాచ్ జరుగుతుంది. అక్టోబర్ 5 నుంచి 8 వరకు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం 'బి' గ్రౌండ్‌లో రెండో మ్యాచ్ ఉంటుంది. వన్డే జట్టుకు లక్ష్య రైచందాని కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. యశ్వర్ధన్ చౌహాన్ వైస్ కెప్టెన్‌గా ఉంటాడు. రెడ్‌బాల్ మ్యాచ్‌లకు చౌహాన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. రైచందాని వైస్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ ప్రస్తుతం ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్‌కు ఆడుతున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడాడు. అన్వయ్ ద్రవిడ్ ఇటీవల శ్రీలంక పర్యటనలో రెండు వన్డేలు ఆడి 101 పరుగులు చేశాడు. వన్డే జట్టులో ఆర్యవీర్, అన్వయ్‌తో పాటు మనల్ చౌహాన్, చిగురుపాటి వెంకటకు చోటు లభించింది. సాగర్ విర్క్, అన్మోల్‌జీత్ సింగ్, ఇషాన్ సూద్ వన్డే జట్టులో లేరు.

# టీ20లో గోల్డెన్ హ్యాట్రిక్.. తొలి మూడు బంతులకు మూడు వికెట్లు

- తొలి 3 బంతుల్లోనే 3 వికెట్లతో గోల్డెన్ హాట్రిక్
- ముగ్గురు బ్యాటర్లు డకౌట్
- దీబన్ లింగేశ్ టీఎన్‌పీఎల్‌లో చరిత్ర
- 99 పరుగులకే ట్రిచీ గ్రాండ్ చోళాస్ ఆలౌట్
- ఫైనల్లో తిరుప్పూర్ తమిళన్స్-మదురై పాంథర్స్ ఢీ



**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడు ప్రీమియర్ లీగ్ (టీఎన్‌పీఎల్)లో బుధవారం అద్భుతం చోటుచేసుకుంది. కేవలం మూడు బంతుల్లోనే మూడు వికెట్లు పడిపోయాయి. పైగా ముగ్గురు బ్యాటర్లు ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరారు. కోవై కింగ్స్‌తో క్వాలిఫయర్-2లో ట్రిచీ గ్రాండ్ చోళాస్ బ్యాటింగ్‌లో ఈ షాకింగ్ ఘటన జరిగింది. 184 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ట్రిచీకి కె. దీబన్ లింగేశ్ తొలి ఓవర్లోనే చుక్కలు చూపించాడు. మొదటి మూడు బంతుల్లోనే కె. రాజ్‌కుమార్, ఎస్. శ్యామ్ సుందర్, జగన్నాథన్ కౌశిక్‌లను ఔట్ చేశాడు. ముగ్గురూ డకౌట్ కావడంతో ట్రిచీ ఆరంభంలోనే కుప్పకూలింది. ఈ ప్రదర్శనతో దీబన్ లింగేశ్ టీఎన్‌పీఎల్ చరిత్రలో అరుదైన రికార్డు సృష్టించాడు. లీగ్‌లో గోల్డెన్ హ్యాట్రిక్ సాధించిన తొలి బౌలర్‌గా నిలిచాడు. అంటే వరుసగా మూడు బంతుల్లో మూడు వికెట్లు తీయడంతో పాటు, ఆ ముగ్గురు బ్యాటర్లు కూడా సున్నాకే వెనుదిరిగారు. ట్రిచీ ఇన్నింగ్స్‌లో మరో రెండు డకౌట్లు కూడా నమోదయ్యాయి. మణిమారన్ సిద్ధార్థ్ జాఫర్ జమాల్‌ను ఔట్ చేశాడు.


ఆ తర్వాత ఆర్. దివాకర్ అధిసయరాజ్ డేవిడ్‌సన్‌ను పెవిలియన్‌కు పంపాడు. చివరికి ట్రిచీ 99 పరుగులకే ఆలౌటైంది. సిద్ధార్థ్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో ఐడ్రీమ్ తిరుప్పూర్ తమిళన్స్ టీఎన్‌పీఎల్ 2026 ఫైనల్‌కు చేరింది. ఆగస్టు 28న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో మదురై పాంథర్స్‌తో టైటిల్ పోరులో తలపడనుంది.

# ఇమేజ్ ను పక్కనబెడితే కనక వర్షమే!

ఒకప్పుడు సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించాలంటే భారీ బడ్జెట్లు, వందల కోట్ల వ్యయంతో కూడిన విజువల్ ఎఫెక్ట్స్, స్టార్ హీరోల ఇమేజ్ మాత్రమే సరిపోతాయని భావించేవారు. కానీ కాలం మారుతున్న కొద్దీ ప్రేక్షకుల అభిరు చి కూడా మారుతోంది. ప్రస్తుతం ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడానికి భారీ హంగులు మాత్రమే సరిపోవని, తెరపై కనిపించే కథలో బలం ఉండాలని చిత్ర పరిశ్రమ స్పష్టంగా గ్రహిస్తోంది. ఈ కొత్త ట్రెండ్‌కు నిదర్శనంగా ఇటీవలి కాలంలో వచ్చిన అనేక సినిమాలు నిలుస్తున్నాయి. స్టార్ ఇమేజ్‌ను నమ్ముకోకుండా విభిన్నమైన కథాంశాలతో వస్తోన్న చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద భారీ ఆదరణ లభిస్తోంది.



సమంత ప్రధాన పాత్రలో రిలీజ్ అయిన -మా ఇంటి



బంగారం-, అఖిల్ అక్కినేని నటించి -లెనిన్-, మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన -కొరియన్ కనకరాజు-, మాస్ మహారాజా రవితేజ తాజా చిత్రం -ఇరుముడి- వంటి ప్రాజెక్ట్‌లు కొత్త కోణానికి అద్దం పడుతున్నాయి. ఈ చిత్రాలన్నీ సాధారణ ఇమేజ్ హంగులకు దూరంగా పూర్తిగా కంటెంట్ ... పాత్రల చుట్టూ తిరిగే కథాంశాలతో రూపుదిద్దుకున్నాయి. స్టార్ హీరోల ఇమేజ్, భారీ మార్కెట్ సమీకరణాలను పక్కన పెట్టి దర్శకుని విజన్‌ను నమ్మి చేసిన చిత్రాలివి. ప్రేక్షకులు కూడా రొటీన్ కమర్షియల్ ఫార్ములాను పక్కన పెట్టి కొత్తదనం ఉన్న కథలను ఎప్పుడూ ఆదరిస్తారని ఈ చిత్రాల ఫలితాలో మరోసారి నిరూపితమవుతోంది. ఇతర భాషల ప్రేక్షకులు సైతం బలమైన కంటెంట్ ఉన్న తెలుగు చిత్రాలకు బ్రహ్మరథం పడుతున్నారని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. భాషా భేదాలతో సంబంధం లేకుండా ఎమోషనల్ కనెక్ట్ ఉన్న సినిమాలను గ్లోబల్ ఆడియన్స్ రిసీవ్ చేసుకుంటున్న తీరు అద్భుతంగా ఉంది. దీంతో నిర్మాతలు కూడా భారీ బడ్జెట్ రిస్క్‌ల కంటే కంటెంట్ బేస్డ్ సినిమాల వైపు మొగ్గు చూపడానికి ఆసక్తిగా ఉన్నారు. ఇది తెలుగు పరిశ్రమ పరిధిని మరింత విస్తృతం చేస్తోంది. నటీనటులు కూడా రెగ్యులర్ ఇమేజ్ ట్రాప్ నుంచి బయటపడి విలక్షణమైన పాత్రలు చేయడానికి ఈ ట్రెండ్ ఎంతగానో దోహదపడుతోంది. ప్రయోగాత్మక చిత్రాలు సైతం కమర్షియల్‌గా మంచి విజయాలను నమోదు చేయోచ్చ ని నిరూపితమవుతుండటంతో దర్శక నిర్మాతల్లో కొత్త ఉత్సాహం వెల్లువెత్తుతోంది. భవిష్యత్ లో కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాల హవా మరింత ఎక్కువగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తానికి ఇమేజ్ కంటే కంటెంటే రాజు అనే నిజాన్ని టాలీవుడ్ మరోసారి బలంగా చాటి చెబుతోంది. భారీ బడ్జెట్ల ప్రయోగాలు విఫలమైన చోట బలమైన కథాంశాలు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఈ సరికొత్త ధోరణి ఇండియన్ సినిమా స్థాయిని మరింత పెంచి భవిష్యత్తులో మరిన్ని గొప్ప చిత్రాలు రావడానికి బాటలు వేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు.



మృణాల్ ఠాకూర్ ఆకర్షణీయమైన ఎరుపు రంగు క్రాప్ టాప్ మరియు గులాబీ రంగు స్కర్ట్‌లో

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965